# ప్రజాశక్తి

## కర్నూలు

బుధవారం
జనవరి
03 - 2017
12 పేజీలు




కంటైనర్‌ను ఢీకొని నుజ్జునుజ్జయిన టాటాఏస్ వాహనం ముందు భాగం

# ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు మృతి
- మరో పది మందికి గాయాలు

**ప్రజాశక్తి-ఎమ్మిగనూరు**

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో పది మందికి గాయలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి... ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి వెళ్తున్న (ఎపి02టివి0771 నంబరు గల) టాటా ఏస్ ఆటో ఎమ్మిగనూరు, బనవాసి, కోటేకల్ తదితర గ్రామాల ప్రయాణికులను ఎక్కించుకుంది. కోటేకల్ గ్రామం దాటిన తర్వాత కొండ వద్ద మలుపు తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న కంటైనర్ ఢీకొట్టింది. కోటేకల్లు గ్రామానికి చెందిన మాదిగ కర్రెమ్మ (65), బోయ అంజనమ్మ (55),

వార్త 4లో

# ప్రజాసంక్షేమమే ధ్యేయం



ప్రజాసంక్షేమమే ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి కెఇ.కృష్ణమూర్తి తెలిపారు. 5వ జన్మభూమి - మాఊరు కార్యక్రమం మంగళవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. పత్తికొండ మండలం పులికొండ గ్రామంలో కెఇ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు పులికొండ రంగస్వామి ఆలయంలో దేవస్థానం అధికారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కెఇ.కృష్ణమూర్తి మాట్లాడారు. ఆత్మకూరు మండలం అమలాపురం గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమానికి కలెక్టర్ ఎస్.సత్యనారాయణ హాజరయి మాట్లాడారు.

ఆళ్లగడ్డ మండలంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా ఆయా శాఖల అధికారులు పాల్గొని జన్మభూమిని ప్రారంభించారు.

# చలి వణికిస్తోంది...

- సమస్యల్లో వసతిగృహ విద్యార్థులు
- మౌలిక సదుపాయాలు కరువే
- వసతి గృహాల్లో దుప్పట్ల కొరత

*ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా పిల్లలను చదివించాలని ఆకాంక్షతో చాలా మంది నిరుపేదలు వసతిగృహాల్లో ఉంచి చదివిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్ల వసతులతో పాటు, మెనూ ప్రకారం భోజనం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించాలి. విద్యార్థులు చలికి తట్టుకునేందుకు మంచి దుప్పట్లు ఇవ్వాలి. కొందరికి నేటికీ దుప్పట్లు అందకపోవడంతో చలికి వణుకుతున్నారు. వసతిగృహాల్లో తలుపులు లేక, కిటికీలు శిథిలమై, కిటికీలకు మెష్‌లు లేక దోమల తీవ్రతకు విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు.*

**ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి**

50 బిసి వసతిగృహాల్లో 8,435 మంది చదువుతున్నారు. వీటిలో 30 హాస్టళ్లు మరమ్మతులకు గురయ్యాయి. జిల్లాలో 54 ఎస్సీ వసతిగృహాలు ఉండగా 27 వసతిగృహాలు మరమ్మతులకు గురయ్యాయి. అందులో 9,350 మంది చదువుతున్నారు. ఇలా మరమ్మతులకు గురైన వసతిగృహాల్లో చాలా వాటిలో తలుపులు, కిటికీలకు తలుపులు లేక, కిటికీలు ఉంటే దోమలు రాకుండా మెష్‌లు లేక, పై స్లాబ్‌లు పెచ్చులు ఊడి, రాత్రిళ్లు చలికి వణుకుతూ, ఉదయం చన్నీళ్ల స్నానం చేస్తూ విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. పేద విద్యార్థులు చదువుకునే ఈ వసతిగృహాల నిర్వహణకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. వసతి గృహాల్లోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో వసతిగృహ సంరక్షకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీని వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. డిసెంబర్

వార్త 4లో



## సిపిఎం జిల్లా మహాసభలకు

# సమాయత్తం

- ఆలూరు వేదికగా చురుకుగా ఏర్పాట్లు

**ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి**

సిపిఎం జిల్లా మహాసభలకు వెనుకబాటుతనానికి మారుపేరుగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన ఆలూరు వేదిక కానుంది. ఈనెల 10, 11, 12 మూడ్రోజుల పాటు జరిగే సిపిఎం 21వ జిల్లా మహాసభలను జయప్రదం చేసేందుకు ఆహ్వాన సంఘం చురుకుగా కదులుతోంది. ఆలూరు సిపిఎం డివిజన్ కార్యదర్శి హనుమంతు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు మొలగవల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహాసభల ఏర్పాట్లు పెద్దఎత్తున సాగుతున్నాయి. నిత్యం కరువు కాటకాలకు గురయ్యే ఆలూరు ప్రాంత సమస్యలను రాజకీయ అజెండాగా మార్చేందుకు సిపిఎం జిల్లా కమిటీ ఈ ప్రాంతంలో మహాసభలు నిర్వహించేందుకు నిర్ణయించింది. ప్రతేడాది ఆలూరు నుంచి వేల సంఖ్యలో వలసలు వెళ్లడం రివాజు. ఎగువన నీటి వనరులు అందుబాటులో ఉన్నా ప్రభుత్వం ఇప్పటి దాకా వాటిని సద్వినియోగం చేసుకునే రీతిలో చర్యలు చేపట్టకపోవడంతో కేవలం వర్షాధారంపైనే వ్యవసాయం సాగుతోంది. వేదవతి నది ఈ నియోజకవర్గం గుండానే ప్రవహిస్తుంది. అలాగే హంద్రీనది దేవనకొండ, ఆస్పరి మండలాల గుండా ప్రవహిస్తున్నా వేసవి వచ్చిందంటే చాలు తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి ఉంది. వేదవతి నదిలో ప్రతేడాది దాదాపు 70 టిఎంసిల నీరు దిగువకు పోతుంది. గూళ్యం వద్ద 8 టిఎంసిలతో రెండు ఎత్తిపోతల పథకాలను చేపడితే ఈ ప్రాంతంలో 80 వేల ఎకరాలకు సాగునీటిని అందించడంతోపాటు తాగునీటి సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. అలాగే ఈ ప్రాంతంలో జింకలు గుంపులుగా పొలాల మీద పడి పంటలను ధ్వంసం చేయడం సర్వసాధారణం. ఈ జింకల బెడదలను తప్పించేందుకు ఈ ప్రాంతంలో జింకల పార్కును ఏర్పాటు చేస్తామ ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల కు ముందు హామీఇచ్చారు. ముఖ్యమంత్రి

వార్త 4లో

### దళితులకు పునరావాసం కల్పించాలి

వార్త 4లో

### అందరమూ సమానమే.. వివక్ష తగదు

వార్త 12లో

### విత్తనోత్పత్తి రైతులపై వేధింపులు ఆపాలి

వార్త 12లో

### అధికారులను నిలదీసిన సిపిఎం నాయకులు, ప్రజలు

వార్త 12లో

# సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష్య కార్యదర్శులు వెంగళ్‌రెడ్డి, జవహర్‌లాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎన్జీవో భవనంలో ఎపి జెఎసి, ఎపి ఎన్జీవోల పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు డిఎ, కరువు భత్యం, 10 నెలల పిఆర్సీ బకాయి వెంటనే చెల్లించాలన్నారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జన్మభూమిలో పాల్గొనే అధికారులపై దాడులు జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని సమావేశం తీర్మానించింది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ కార్మికుల సమస్యలు తీర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందన్నారు. ఈ నెల 9న అన్ని తాలుకా కేంద్రాలు, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎపి ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జిల్లా సహాధ్యక్షులు దస్తగిరి రెడ్డి, కార్యవర్గ సభ్యులు లక్ష్మినారాయణ, సుధాకర్ రెడ్డి, బాబు, రామకృష్ణారెడ్డి, కృష్ణుడు, అన్ని తాలుకాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంగళ్ రెడ్డి



తహశీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచి గోపాల్

## అధికారులకు శుభాకాంక్షల వెల్లువ

**ప్రజాశక్తి - గూడురు**

గూడూరు పట్టణంలోని ప్రభుత్వ అధికారులకు మండలంలోని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మునగాల సర్పంచు గోపాల్ తహశీల్దార్ శివశంకర్‌నాయక్‌ను పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపిటిసి సభ్యులు రామచంద్రుడు, గ్రామప్రజలు పాలొన్నారు.

## దళితులపై దాడులు ఖండించాలి

**పత్తికొండ :** దళితులపై జరుగుతున్న దాడులను ప్రజాసంఘాలు, మేథావులు ముక్తకంఠంతో ఖండించాలని దళిత సమైక్య మండలాధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి థామస్ కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామంలో దళితులను కులం పేరుతో దుషించి గ్రామబహిష్కరణ చేసిన అగ్రవర్ణాల వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసుల, రఘురామ్ పాల్గొన్నారు.

## నేడు 'రజకుల పట్ల ప్రభుత్వం విధానాలు'పై సదస్సు

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

'రజకుల పట్ల ప్రభుత్వ విధానాలు' అంశంపై నేడు స్థానిక కెకె భవన్‌లో ఉదయం 10 గంటలకు జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపి రజక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.నాగరాజు , సి.గురుశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2018 రజక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.భాస్కరయ్య హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని రజక సంఘం నాయకులంతా హాజరై సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

## జాతీయ సెపక్‌తక్రా బ్రోచర్ విడుదల

**కర్నూలు స్పోర్ట్స్ :** ఈ నెల 16వ తేది నుండి 20 వరకు ఎపి సెపక్‌తక్రా సంఘం, కర్నూలు జిల్లా సెపక్‌తక్రా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సబ్ జూనియర్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీల బ్రోచర్‌ను ఎమ్మెల్సీ కెఇ.ప్రభాకర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలను జయప్రదం చేయాలని అన్ని క్రీడా సంఘాలను, జిల్లా యంత్రాగాన్ని కోరారు. కార్యమంలో రాష్ట్రసెపక్ తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఒలంపిక్ సంఘం ప్రతినిధి విజయ్‌కుమార్, క్రీడాసంఘం ప్రతినిధులు సునిల్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## బోయలను ఎస్సీ జాబితాలో చేర్చడం సిగ్గుచేటు

**వెల్దుర్తి రూరల్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బోయలను ఎస్సీ జాబితాలో చేర్చడం సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోటర్ రాముడు విమర్శించారు. మంగళవారం స్థానిక అతిథిగృహంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలాధ్యక్షులు వై.శోభన్‌బాబు, ఎల్లరాముడు, చిన్నరాజు, వెంకటేష్, పరుశురాముడు, ఎల్లనాగి పాల్గొన్నారు.

## యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - కోడుమూరు**

యుటిఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని స్థానిక ఎంఆర్‌సి భవనంలో కోడుమూరు మండలాధ్యక్షులు నాగిరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ క్యాలెండర్, డైరీని విడుదల చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎంఇఒ అనంతయ్య, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.నీలకంఠ, వీరనారాయణమ్మ, మండల నాయకులు తాజుద్దీన్, వీరభద్రుడు, అలీఖాన్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న మండలాధ్యక్షులు నాగిరెడ్డి, ఎంఇఒ అనంతయ్య, యుటిఎఫ్ నాయకులు

# ప్రజా సంక్షేమమే ధ్యేయం

## డిప్యూటీ సిఎం కెఇ.కృష్ణమూర్తి



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం కెఇ.కృష్ణమూర్తి

**ప్రజాశక్తి - పత్తికొండ**

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే టిడిపి ధ్యేయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కెఇ.కృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం పత్తికొండ మండలం పులికొండ గ్రామంలో జన్మభూమి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు పులికొండ రంగస్వామి ఆలయంలో దేవస్థానం అధికారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో డిప్యూటీ సిఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కెఇ.కృష్ణమూర్తి మాట్లాడారు. నిధుల కొరత ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. నిరుపేద ప్రజల సంక్షేమం కోసం రేషన్‌కార్డులు, పింఛన్లు, గృహ నిర్మాణాల పథకాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవినీతి అక్రమాలు చోటు చేసుకోకుండా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేని ప్రతిపక్ష వైసిపి నేత జగన్‌మోహన్‌రెడ్డి లేనిపోని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. కేవలం అధికార దాహం కోసమే జగన్ పాదయాత్ర చేస్తున్నారని విమర్శించారు. పాదయాత్రకు ఇప్పటికే అనేక ప్రాంతాల్లో ఆదరణ కరువయిందని అన్నారు. రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో టిడిపి అధిక స్థానాలను కైవసం చేసుకుని అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం రేషన్‌కార్డులు, రుణవిముక్తి పత్రాలు, పింఛన్లు పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఆర్‌డిఒ ఓబులేసు, టిడిపి పత్తికొండ ఇన్‌ఛార్జి శ్యాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, జడ్పిటిసి ఈడిగ సుకన్య, ఎంపిపి ఈడిగ రాజేశ్వరి, సర్పంచి రంగమ్మ, టిడిపి యువనాయకులు నాగయ్య గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోండి**


**కోడుమూరు :** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుని, పరిశుభ్రత పాటించాలని కోడుమూరు మండలాధ్యక్షులు కె.నాగిరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని అమడగుంట్ల గ్రామంలో జన్మభూమి కార్యక్రమం నోడల్ అధికారి భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మండలాధ్యక్షులు నాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారులు జన్మభూమి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం ప్రజలు పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని నోడల్ అధికారికి వినతులు అందజేశారు. అనంతరం ఎంఇఒ అనంతయ్య విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రదర్శించారు. మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

**గూడురు/రూరల్ :** ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జీ విష్ణువర్థన్‌రెడ్డి తెలిపారు. గూడూరు, మండలంలోని బూడిదపాడు గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపిపి ఈశ్వరమ్మ, ఎంపిడిఒ నాగేశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ శివశంకర్ నాయక్, టిడిపి మండల కన్వీనర్ సురేష్, మాజీ ఎంపిటిసి మెంబర్ కృష్ణ పాల్గొన్నారు.



కోడుమూరులో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు

**సి.బెళగల్ :** మండలంలోని కొత్తకోట గ్రామంలో మండల ప్రత్యేక అధికారి ప్రసాద్‌రావు, ఎంపిడిఒ సిద్దలింగమూర్తి అధ్యక్షతన మంగళవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు తిప్పన్నకు రైతురథం కింద ట్రాక్టర్‌ను పంపిణి చేశారు. సుమారు 135 రేషన్ కార్డులను, చంద్రన్నబీమా పథకాలను, చంద్రన్న సంక్రాంతి కానుకలను లబ్దిదారులకు అందజేశారు.



సి.బెళగల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు

కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే మణిగాంధీ, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, జిల్లా కేంద్రం నుండి ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు. నేడు మునుమాల, కొండాపురంలో జన్మభూమి కార్యక్రమం జరగనుందని ఇఒఆర్‌డి సుమిత్రమ్మ తెలిపారు.

**క్రిష్ణగిరి :** ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల నోడల్ అధికారి రఘునాథ్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఎస్.హెచ్ ఎర్రగుడిలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచు సురేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యురాలు శాలుబి, ఎంపిడిఒ మురళీ మోహన్‌మూర్తి, ఎంఆర్ఒ రామసుబ్బయ్య, జన్మభూమి కమిటీ సభ్యులు నబిసాహెబ్, మర్రి శ్రీరాములు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


**వెల్దుర్తి రూరల్ :** అర్హులైన లబ్దిదారులకు పథకాలు టిడిపి ప్రభుత్వంలోనే సాధ్యమని ఎంపిపి శైలజసుబ్బారాయుడులు అన్నారు. మల్లెపల్లె గ్రామంలో చంద్రన్న సంక్రాంతికానుకలను పంపిణి చేశారు. మల్లెపల్లె, అల్లుగుండు గ్రామాల్లో తహశీల్దార్ రామాంజులునాయక్, ఎంపిడిఒ అబ్దుల్‌వహీద్‌ల ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించని జన్మభూమి ఎందుకు..? : సిపిఎం**

**కర్నూలు కార్పొరేషన్ :** సమస్యలను పరిష్కరించని జన్మభూమి కార్యక్రమం ఎందుకని సిపిఎం కర్నూలు నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ విమర్శించారు. నగరంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమం పండ్ల మార్కెట్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎం.రాజశేఖర్ సిపిఎం నాయకులు రాజగోపాల్, సుభాన్, షరీఫ్, పార్వతయ్యలు కలిసి నోడల్ అధికారి శంకర్‌రెడ్డికి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం అధికారి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషిచ చేస్తామన్నారు. నాగశేఖర్, గౌస్, షేక్షావలి పాల్గొన్నారు.

**గడియారం ఆసుపత్రిని అభివృద్ధి చేసి వైద్యులను, సిబ్బందిని నియమించాలి**

పాతబస్తీలోని గడియారం ఆసుపత్రిని అభివృద్ధి చేసి, గైనిక్ డాక్టర్‌తోపాటు సిబ్బందిని నియమించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని సిపిఎం బృందం డిమాండ్ చేసింది. జన్మభూమి కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కమిషనర్ హరినాథరెడ్డిలకు సిపిఎం నగర నాయకులు నిర్మల, షరీఫ్, రసీదా, అలివేలు, అరుణ, కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే, కమిషనర్లు మాట్లాడుతూ వీలైనంత త్వరలో డాక్టర్‌ను, సిబ్బందిని నియమించడానికి కమిటీ వేస్తామని, ఆసుపత్రిని అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. అక్బర్, ముక్త్యార్, మహబాష, చాంద్‌బాష పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఎస్వికి వినతి ఇస్తున్న సిపిఎం నాయకులు

## జొన్న పంట దగ్ధం

**ఆలూరురూరల్ :** ఆలూరులోని సిద్దేశ్వర కాలనీకి చెందిన కౌలు రైతు వల్లూరుస్వామి 3 ఎకరాల పొలంలో జొన్న పంట తొలగించి పొలంలో ఎండేందుకు వదిలేశారు. రాత్రి పంట పూర్తిగా కాలిపోవడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. సుమారు రూ.లక్ష వరకు నష్టం కలిగినట్లు రైతు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సాయమందించి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామాంజినేయులు, జిల్లా సహాయ కార్యదర్శి గిడ్డయ్య, మండల నాయకులు మునిస్వామి బాషా, బాబు, సుంకన్న ప్రభుత్వాన్ని కోరారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

**పాణ్యం :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులందరికి అందించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. 5వ విడత జన్మభూమి-మాఊరు అలమూరులో తహశీల్దార్ అనురాధ, కొణిదేడులో ఎంపిడిఒ చంద్రశేఖర్‌రావు నిర్వహించారు. కొణిదేడులో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి పాల్గొని, మాట్లాడారు. అధికారులు, రాజకీయాలకు అతీతంగా పని చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పలు సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి అందేలా చూడలన్నారు. పింఛన్లు, మరుగుదొడ్లు, ఇళ్ల నిర్మాణాలు తదితర వాటిని జన్మభూమి కమిటీ సభ్యుల చొరవ లేకుండా అధికారులు పని చేయాలని సూచించారు. రాబోయే రబీ సీజన్‌లో గోరుకల్లు జలశయం నుండి ఎస్సార్బీసీ కాల్వ నుంచి రైతులు పండించుకునే విధంగా అధికారులు పని చేయాలన్నారు. ప్రత్యేక అధికారి ఫిరోజ్ ఖాన్, ఎంపిటిసి నారాయణమ్మ, ఎంపిపి చిన్న సంజీవ, సర్పంచి పద్మావతమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నాగమణి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## దళిత కుటుంబాలను ఆదుకుంటాం

**రుద్రవరం :** రుద్రవరం మండలంలోని నక్కలదిన్నె గ్రామ దళిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నరహరి ప్రసాద్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఆదేశాల మేరకు ఆయన, పలువురు ఉన్నతాధికారులతో గ్రామాన్ని సందర్శిం చారు. డిసెంబర్ 31వ తేదీన అగ్రవర్ణాల వారు దళితులను గ్రామ బహిష్కరణ చేసి, వారి కాలనీకి తాగునీటి సరఫరా, నిత్యావసర సరుకులను నిలిపివేయడం జరిగిందని దళితులు కమీషన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సంఘటనకు బాధ్యులైన 11 మంది అగ్రవర్ణాల వారిపై కేసు నమోదు చేశారు. కాలనీకి వెంటనే తాగునీటి సరఫరా, నిత్యావసర సరుకులు అందేలా చర్యలు తీసుకున్నట్లు కమీషన్ సభ్యుడు నరహరి ప్రసాద్ తెలిపారు. మౌళిక సదుపాయాలు వెంటనే కల్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.



# పెండేకల్లులో జన్మభూమి బహిష్కరణ

**ప్రజాశక్తి - తుగ్గలి**



గ్రామంలోకి అధికారులను రాకుండా అడ్డుకుంటున్న గ్రామస్తులు

తుగ్గలి మండలం పెండేకల్లు గ్రామంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు వస్తున్నారు. ఈ విషయం గ్రామస్తులు తెలుసుకున్నారు. గ్రామంలోకి అధికారులు రాకుండా గ్రామస్తులు అధికారులను చుట్టూ ముట్టారు. ఎద్దులదొడ్డి టూ పెండెకల్లు రోడ్డు వేసే వరకు తమ గ్రామంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించవద్దంటూ అధికారులను నిలదీశారు. జన్మభూమి కార్యక్రమం నిర్వహించినప్పుడల్లా త్వరలో రోడ్డు వేస్తామని హామీ ఇవ్వడం తప్ప వేసేది లేదన్నారు. నాలుగేళ్ల గడిచిన ఇప్పటి వరకు రోడ్డు వేయక పోవడంతోనే జన్మభూమి కార్యక్రమం బహిష్కరి స్తున్నట్లు ప్రజలు అధికారులతో మండి పడ్డారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వల్ల అధికారులు జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తే పెట్రోలు పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని ప్రజలు తేల్చి చెప్పారు. పత్తికొండ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సిఎం నాగేళ్ల గడిచిన పెండెకల్లు రోడ్డు వేయకపోవడం చాలా సిగ్గు చేటని ప్రజలు మండిపడ్డారు. అధికారులు దిక్కుతోచని పరిస్థితిలో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించకుండా అధికారులు వెళ్లిపోయారు. వెనక్కి తిరిగి వెళ్లిన వారిలో గోపాల్‌రావు, మండల స్థాయి అధికారులు ఉన్నారు. అనంతరం ఎద్దులదొడ్డి గ్రామంలో జన్మభూమి కార్యక్రమాన్ని సర్పంచి వీరేష్ అధ్యక్షతన నిర్వహించారు. గ్రామస్తులు ఫించన్లు, రేషన్‌కార్డులు దరఖాస్తు చేసుకున్నారు.

# సర్పంచి లేకుండానే సంబరాలు

## - అభివృద్ధి చేయకుండా సన్మానాలు

**శిరువెళ్ల :** స్థానిక గ్రామ పంచాయతీ, మండల స్థాయి అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు గురై అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని, వార్డు మెంబర్ల ఆమోదంతో ప్రతిపాదనలు చేసిన పనులకు అధికారులే మోకాళ్లడుతున్నారని, నిధులు ఉన్న అధికారుల వైఖరితో అభివృద్ధి పనులకు ఖర్చు చేయలేని దుస్థితి నెలకొని ఉందని శిరువెళ్ల మేజర్ పంచాయతీ సర్పంచి రత్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచి అయిన తనకు తెలియకుండానే ఈనాడు విలేఖరి రాజ్‌కుమార్‌ను సన్మానించడం వెనుక అంతర్య మేమిటో బయట పెట్టాలని పేర్కొన్నారు. సమస్యను వెలికితీయకుండా, అభివృద్ధి చేయాల్సిన పనులను వెలికి తీయకుండా అధికారులకు తొత్తుగా మారిన ఒక విలేఖరినే ఎందుకు సన్మానించారని, మిగిలిన విలేఖరులను ఇఒఆర్‌డి, ఎంపిడిఒ దృష్టిలో మిగిలిన 9మంది విలేఖరులు కాదా అని ప్రశ్నించారు. గ్రామ ప్రజలు సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు, నీటి వసతి వాటిని చేయాలని పదేపదే అడుగుతున్నా స్థానిక ఇఒఆర్‌డి, ఎంపిడిఒ సహకరించకుండా నిధులు ఒరిగిపోయేందుకు, ప్రజా సంక్షేమానికి, శిరువెళ్ల అభివృద్ధికి తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇఒఆర్‌డి, ఎంపిడిఒ శిరువెళ్ల పంచాయతీ ప్రజలను నయవంచనకు గురి చేస్తున్న మోసాన్ని త్వరలో బయటపెడతానని పేర్కొన్నారు.

## ఏడాదిలోపే దెబ్బతిన్న రోడ్లు

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

నగరంలోని 34వ వార్డు ఫరూక్ నగర్‌లో నాణ్యత లేకుండా వేసిన సిసి రోడ్లు సంవత్సరంలోపే దెబ్బతిన్నాయని సిపిఎం 31వ వార్డు కార్యదర్శి సుధాకరప్ప పేర్కొన్నారు. మంగళవారం సుధాకరప్ప, ఆంజనేయులు సిసి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ నగరాభివృద్ధికి వచ్చిన నిధులు అధికారులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై పర్సంటేజ్‌లు పంచుకుంటూ నాణ్యతలేని సిసి రోడ్లు వేస్తున్నారని విమర్శించారు. అవినీతికి పరాకాష్ట ఈ రోడ్డే నిదర్శనమన్నారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సిపిఎం జిల్లా మహాసభల పోస్టర్ విడుదల

**ప్రజాశక్తి-పత్తికొండ**

ఆలూరులో ఈ నెల 10, 11, 12న జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి దస్తగిరి కార్యకర్తలను కోరారు. మంగళవారం స్థానిక ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో సిపిఎం జిల్లా మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలూరులో 10వ తేది ప్రదర్శన ర్యాలీ, బహిరంగ సభ, 11, 12న ప్రతినిథుల సభ ఉంటుందని తెలిపారు. గతంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఇచ్చిన సమస్యలనే తీర్చలేదని, ప్రస్తుతం అదే పేరుతో వందల కోట్ల ప్రజాధనం ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. మండల కమిటీ సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సంగారెడ్డి, ఆటో వర్కర్స్ నాయకులు మహబూబ్ బాషా, హమాలీ వర్కర్స్ నాయకులు రామాంజనేయులు, ప్రభాకర్, ఉదయ్, గోపాల్ పాల్గొన్నారు.




రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామంలో దళితులను బహిష్కరించిన పెత్తందారులను వెంటనే చేసి శిక్షించాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట కెవిపిఎస్ నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.



రాజమండ్రిలో మసీదు మౌజమ్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ముస్లిం మైనార్టీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కర్నూలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి హఫీజ్ ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

## పింఛను కోసం వెళ్లి వృద్ధుడు మృతి

**ప్రజాశక్తి - గూడూరు రూరల్**

స్థానిక బూడిదపాడు గ్రామానికి చెందిన హరిజన యాకోబ్ (70) జన్మభూమి గ్రామసభలో మంగళవారం పింఛను తీసుకునేందుకు వెళ్ళి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యాకోబ్ కొంత కాలంగా పింఛను తీసుకుంటున్నాడు. ఈ నెల పింఛను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇస్తున్నారని తెలియడంతో ఇంటి నుంచి బయలు దేరాడు. మార్గమధ్యంలోనే అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. చుట్టూ పక్కల నివాసాల వారు గమనించారు. వెంటనే అక్కడ చేరుకొని ఆయన పైకిలేపగా అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి వెంటనే చేరుకున్నారు. వెంటనే వారు యాకోబ్ మృతి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు చంద్రన్న బీమా అందిస్తామని హామీ ఇచ్చారు.

## అనారోగ్యంతో ఎన్‌ఎంయు ఆర్‌టిసి డిపో సెక్రటరీ దస్తగిరి మృతి

**ప్రజాశక్తి - కోవెలకుంట్ల**

కోవెలకుంట్ల ఆర్‌టిసి డిపోలో ఎన్‌ఎంయు డిపో సెక్రటరీగా, కండక్టర్‌గా పని చేసిన దస్తగిరి(50) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. దస్తగిరి 1992 సంవత్సరంలో ఆర్‌టిసి కండక్టర్‌గా విధుల్లోకి చేరారు. కర్నూలు, నంద్యాల, కోవెలకుంట్ల డిపోల్లో పనిచేశారు. ఈయన మృతిచెందడంతో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఎస్‌డిఐ నాగశేషుడు, డిపో గౌరవాధ్యక్షులు భూమా బ్రహ్మానందారెడ్డి, ఎన్‌ఎంయు నాయకులు శివరాం, కండెక్టర్లు, డ్రైవర్లు, ఆర్‌టిసి సిబ్బంది ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈయనకు భార్య ఇద్దరు కుమారులున్నారు.

## మతిస్థిమితం కోల్పోయి వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాశక్తి - సి.బెళగల్**

మండలంలోని చెరువు సమీపంలో ఓ వ్యక్తి అనుమానాదస్పదస్థితిలో పడివున్న మృత దేహం మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. గోనెగండ్ల మండలం ఆలువాల వాసి కురువ మల్లేష్(26) అనే వ్యక్తికి హైదరాబాదు వలస జీవనంలో గతేడాది ఓ ప్రమాదం చోటు చేసుకోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణాలతో బయటపడినా మతిస్థిమితం సరిగ్గా లేక ఇంటి పాటున ఉండే వాడుకాదు. 2, 3 సార్లు వికృత చేష్టలతో ఆత్మహత్యలకు పాల్పడేవారని సమాచారం. ఆదివారం అర్ధరాత్రి బెళగల్‌కు వచ్చి వెంట తెచ్చుకున్న క్రిమిసంహార మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం అటుగా వెళ్తున్న కొందరు గమనించి బెళగల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణమే అక్కడకు పోలీసులు చేరుకొని ప్రాథమిక విచారణ చేపట్టారు. ఆలువాల వాసిగా గుర్తించి మతిస్థిమితం లేకనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

## నక్కలదిన్నెలో 11 మంది అరెస్టు

**ప్రజాశక్తి - కర్నూలు క్రైం**

స్మశానంలో గుంత తీయడానికి రాలేదన్న నెపంతో దళిత వాడకు మంచినీరు, విద్యుత్, నిత్యావసర సరుకులు నిషేధించి దళితులపై వివక్ష చూపారన్న బాధితుల ఆరోపణలపై నక్కలదిన్నె గ్రామానికి చెందిన 11 మందిపై రుద్రవరం పోలీసు స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ కేసు నమోదైంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో 1. సగిలి శివశంకర్‌రెడ్డి, 2. సిద్ది సుబ్బారెడ్డి అలియాస్ పెద్దసుబ్బారెడ్డి, 3. పల్లె రాజారెడ్డి, 4. నారబోయిన తిరుపాలు అలియాస్ గొల్ల తిరుపాలు, 5. పల్లె గోపాల్‌రెడ్డి, 6. పల్లె వెంకటరామిరెడ్డి, 7. మండ్ల పక్కీరయ్య అలియాస్ బోయ పక్కీరయ్య, 8. మండ్ల మల్లికార్జున అలియాస్ బోయ బోయ మల్లికార్జున, 9. నారబోయిన ఉస్సేని అలియాస్ గొల్ల ఉస్సేని ఉన్నారన్నారు. మిగిలిన ఇద్దరు 10. గొల్ల మౌలాలి, 11. సూలం గొల్ల చిన్న సుబ్బారాయుడు పరారీలో ఉన్నారని ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ తెలిపారు.

# జన్మభూమి పవిత్రమైన కార్యక్రమం : కలెక్టర్

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

జన్మభూమి - మాఊరు కార్యక్రమం ఓ పవిత్రమైనదని కలెక్టర్ ఎస్.సత్యనారాయణ, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆత్మకూరు మండలం అమలాపురం గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యనారాయణ మాట్లాడారు. ప్రతి నియోజకవర్గానికి అదనంగా 2 వేల పింఛన్లు మంజూరయ్యాయని, కొత్త పింఛన్‌దారులకు ఉగాది నుంచి అందిస్తామని తెలిపారు. జిల్లాలో అర్హులందరికీ రేషన్‌కార్డులు అందిస్తామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా రూ.20.5 కోట్ల వడ్డీలేని రుణాలు అందజేస్తామన్నారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందించేందుకు రూ.14 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. స్త్రీనిధి కింద జిల్లాలో రూ.7.10 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ తదితర వర్గాల ఆర్థికాభివృద్ధికి, పాడి పరిశ్రమ పెంపొందించేందుకు రూ.8.3 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కుటుంబ వికాస్, సమాజవికాస్ అనే నినాదంతో ప్రతి కార్డుదారుడికి



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యనారాయణ

5 కిలోల బియ్యం, ప్రతి ఇంటికి గ్యాస్ కనెక్షన్, తాగునీరు, ఉద్యోగ భద్రత తదితర అంశాలను, అందరికీ విద్య, ఆరోగ్యం, ఆదాయం నినాదాలతో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద జిల్లాకు రూ.370 కోట్లు వచ్చినట్లు తెలిపారు.

**7న సిద్ధాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభం : ఎమ్మెల్యే**

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... మండలంలోని సిద్ధాపురం లిఫ్ట్ ఇరిగేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా ప్రారంభిస్తున్నామని తెలిపారు. 7న ఓ పండగ వాతావరణంలో ఈ కార్యక్రమం చేపడతామని చెప్పారు. ప్రజలందరూ పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. మండలంలోని చెంచులకు పక్కాగృహాలు నిర్మించేందుకు 260 ఇళ్లను కలెక్టర్ మంజూరు చేశారని, ప్రభుత్వం ఆర్‌డిటి సంస్థ ద్వారా ఇళ్లు కట్టిస్తామని తెలిపారు. అమలాపురం గ్రామంలో రూ.2 కోట్లతోనే సిసి రోడ్ల నిర్మాణ పనులు చేశామని, ఈ గ్రామంలో ప్రతి ఒక్కరికీ పక్కాగృహాలు మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. నోడల్ అధికారి సత్యరాజు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, ఆర్‌డిఒ హుస్సేన్‌సాహెబ్, ఎంపిపి సౌజన్య, జడ్‌పిటిసి వెంకటరాముడు, తహశీల్దార్ రాజశేఖర్‌బాబు, సర్పంచి రవీంద్రబాబు, ఎంపిడిఒ శశికళ, వ్యవసాయశాఖ ఎడి సాలురెడ్డి, ఎంఇఒ జానకిరాముడు, పిఆర్ ఎఇ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్‌బాబు, ట్రాన్స్‌కో ఎఇ రమేష్, వ్యవసాయ శాఖ ఎఒ సురేష్‌బాబు పాల్గొన్నారు.

## దళితులకు పునరావాసం కల్పించాలి

**రుద్రవరం :** అగ్రవర్ణాల చేత గ్రామ బహిష్కరణకు గురైన నక్కలదిన్నె దళితులకు పునరావాసం కల్పించాలని పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు కర్నూలు జిల్లా రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నక్కలదిన్నె గ్రామ దళితులతో సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 31న జరిగిన సంఘటనపై వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు. ప్రతి కుటుంబానికీ రూ.లక్ష చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఉన్న వందలాది ఎకరాల దేవాలయ భూములను దళితులకు పంపిణీ చేయాలని కోరారు. దళితులకు పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.ఆనంద్‌బాబు, ఉపాధ్యక్షులు సుధాకర్, వ్యకాస నాయకులు నాగేశ్వరరావు, దళిత సమాఖ్య నాయకులు గుర్రప్ప, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ అధ్యక్షులు మునెయ్య, మాల మహానాడు నాయకులు ప్రసాద్, సాంబశివుడు, శ్రీనివాసులు, చంటి ఓబయ్య, ఎంఆర్‌పిఎస్ నాయకులు రామాంజనేయులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పక్కాగృహాలు నిర్మించాలి : సిపిఎం

**ఆత్మకూరు :** పట్టణంలో 2001, 2004లో పట్టాలిచ్చిన పేదలందరికీ స్థలాలు చూపించి వారికే ఎన్‌టిఆర్ పక్కాగృహాలు నిర్మించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వి.ఏసురత్నం, నాయకులు రణధీర్, ఎం.రజాక్ కోరారు. మంగళవారం జన్మభూమి - మాఊరు సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అధికారులు, నగర పంచాయతీ ఛైర్మన్ శివపురం నూర్‌మహ్మద్, కమిషనర్ రమేష్‌బాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టాలిచ్చిన వారికి కాకుండా సొంత స్థలాలు ఉన్న వారికి మాత్రమే ఎన్‌టిఆర్ గృహాలు ఇస్తామని ప్రచారం జరుగుతోందని తెలిపారు. గతంలో ఇచ్చిన 4500 మంది లబ్ధిదారులకు స్థలాలు చూపించి ఎన్‌టిఆర్ గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. వాకిటిపేటలోని సామూహిక మరుగుదొడ్డికి నీటి సౌకర్యం కల్పించి మహిళలకు ఉపయోగపడేటట్లు చూడాలని తెలిపారు. అనంతరం డిటి లోకేష్ మాట్లాడుతూ... పట్టాలిచ్చిన వారందరికీ స్థలాలు చూపించి పక్కాగృహాలు నిర్మిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... వాకిటిపేటలోని సామూహిక మరుగుదొడ్డికి వెంటనే నీటి సౌకర్యం కల్పించి అందుబాటులోకి తెస్తామన్నారు. సిపిఎం పట్టణ నాయకులు ఎ.సురేంద్ర, ఎస్.ఇస్మాయిల్, రామునాయక్, గణపతి, జబీవుల్లా పాల్గొన్నారు.

## యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

**పాములపాడు :** మండలంలోని బానుముక్కల యుపి పాఠశాలలో యుటిఎఫ్ డైరీలు, క్యాలెండర్‌ను ఎంఇఒ బాలాజీనాయక్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పని చేస్తున్న యుటిఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఉపాధ్యాయులు విధుల పట్ల శ్రద్ధ వహించి మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విజయకుమార్ పాల్గొన్నారు.

## సమాయత్తం...

**మొదటి పేజీ తరువాయి... :** అయ్యాక కూడా జింకల పార్కుపై ప్రకటన చేశారు. అలాగే వేదవతి నదిపై ఎత్తిపోత పథకాలను యుద్ధప్రాతిపదికన చేపడతామని హామీఇచ్చారు. ఈ రెండు ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదు. అలాగే వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో నగరదోణ వద్ద ఒక రిజర్వాయరుకు శంకుస్థాపన చేసినా అందులో పునాదిరాళ్లు కూడా వేయకపోని పరిస్థితి ఉంది. ఈ ప్రాంతానికి ఆనుకొని హంద్రీనీవా ప్రాజక్టు వెళ్తోంది. ఈ ప్రాజక్టు గుండా 40, 50 టిఎంసిల నీరు వెళ్తున్న ఆస్పరి మండలంలో ఒక రిజర్వాయరు నిర్మించి ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని నింపాలనే డిమాండ్ ఉంది. కరువు కాటకాలకు గురయ్యే ఈ ప్రాంతం సమస్యలను రాజకీయ అజెండాగా మార్చేందుకు సిపిఎం జిల్లా మహాసభలను ఈ ప్రాంతంలో నిర్వహిస్తుండడం పట్ల ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు షడ్రక్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు, పిఎస్.రాధాకృష్ణ హాజరు కానున్నారు.

# చలి వణికిస్తోంది...

**మొదటి పేజీ తరువాయి...**

మూడో వారం నుంచి చలి తీవ్రత పెరగడంతో విద్యార్థులు చలికి వణుకుతున్నారు. విద్యార్థులకు సరిపడ దుప్పట్లు లేకపోవడంతో చలికి ఇబ్బందులు పడుతున్నారు. విద్యా సంవత్సరం మొదలయ్యే సమయానికే ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టాల్సిన విద్యా శాఖ అధికారులు విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**జిల్లాలోని వసతిగృహాల పరిస్థితి ఇలా..**

జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతుల కోసం రూ.3 కోట్లతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇంకా నిధులు రాలేదు. బిసి వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి రూ.4.60 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు రాలేదని అధికారులు పేర్కొంటున్నారు. ఆత్మకూరు పట్టణంలోని బాలికల వసతిగృహంలో తలుపులు, కిటికీలు పని చేయడం లేదు. కొన్ని గదులకు కిటికీలు లేవు. చలిగాలి నేరుగా లోపలికి వస్తుందని విద్యార్థినులు వాపోతున్నారు. ఇదే పట్టణంలో ఉన్న ఎస్సీ కళాశాల వసతిగృహం శిథిలమైన భవనంలో కొనసాగిస్తున్నారు.

బనగానపల్లె వసతిగృహంలోని రెండు గదుల్లో ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు. బిసి వసతిగృహం పాతబడడంతో రవ్వలకొండపైకి మార్చారు. అక్కడ సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఇల్లూరు కొత్తపేట బిసి వసతిగృహంలో ప్రహరీ లేకపోవడంతో పశువులు, కుక్కలు వస్తున్నాయి. వసతిగృహం శుభ్రంగా లేకపోవడంతో దోమల బెడద ఎక్కువైందని విద్యార్థులు వాపోతున్నారు. నందివర్గంలో ఉన్న ఎస్సీ వసతి గృహంలో కిటికీలకు తలుపులు లేక ఇబ్బందులు పడుతున్నారు. మహానంది మండలం ఎం.తిమ్మాపురంలో ఉన్న కెజిబివి బాలికల వసతిగృహం, ఆదర్శ వసతిగృహం, మహానందిలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బాలికలు ఉంటున్నారు. ఇందులో బాలికలకు దుప్పట్లు సరఫరా కాలేదు. కిటికీలకు తలుపులు లేకపోవడంతో కాగితపు అట్టలను అడ్డుగా పెట్టుకున్నారు. ఏడాదిగా కిటికీల సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.బండి ఆత్మకూరు బిసి వసతి గృహంలో మొత్తం 8 గదులున్నాయి. కొన్ని గదులకు కిటికీ రెక్కలు లేవు. చలి తీవ్రతకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కర్నూలు నగరం బిక్యాంపులో ఉన్న బిసి వసతిగృహంలో అనేక సమస్యలున్నాయి. ఇందులో 220 మంది విద్యార్థులున్నారు. ఈ వసతి గృహంలో ఏ గది చూసినా తలుపులు, కిటికీల సమస్యలు ఉన్నాయి. దుప్పట్లు లేక విద్యార్థులు చలికి వణుకుతున్నారు. రూ.కోట్లు ఖర్చు పెట్టి పేద విద్యార్థులకు విద్యనందిస్తున్న ప్రభుత్వం అవసరాన్ని బట్టి సరైన వసతులు సకాలంలో కల్పిస్తే విద్యార్థులు బాగా చదువుకుంటారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

**దుప్పట్లు కొందరికే ఇచ్చారు**

**సోమేశ్వర్‌రెడ్డి 7వ తరగతి, సిబెళగల్**

వసతిగృహంలో చలి తీవ్రంగా ఉంది. ఇక్కడ కొందరికి దుప్పట్లు ఇచ్చారు. ఇంకొందరికి ఇక్కడ చదువు ముగించుకున్న పదో తరగతి విద్యార్థుల దుప్పట్లు ఇచ్చారు. అవి చిరిగి ఉండడంతో చలికి ఆగడం లేదు. దుప్పట్ల గురించి చాలాసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు.

**ప్లేట్లు, గ్లాసులు ఇవ్వడం లేదు**

**మహేష్, 9వ తరగతి, సిబెళగల్**

ఏడేళ్ల నుంచి ప్లేట్లు, గ్లాసులు అందడం లేదు. నీటి కొరత చాలా ఉంది. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇంటి నుంచే తెచ్చుకుంటున్నాం. కాస్మోటిక్స్ ఛార్జీల కింద రూ.62 ఇస్తున్నారు. అవి ఏమాత్రం సరిపోవడం లేదు. కనీసం రూ.200 ఇస్తే బాగుంటుంది.

## సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ఆత్మకూరు :** ఈనెల 10 నుంచి 12 వరకూ ఆలూరులో నిర్వహించే సిపిఎం 21వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎ.రాజశేఖర్, డివిజన్ కార్యదర్శి వి.ఏసురత్నం కోరారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం పోరాడుతోందని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి రూ.500 కోట్లు నిధులు ఇవ్వాలని, ముఖ్యమంత్రి జిల్లాకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సాగు, తాగునీరు, వలసల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, మూతపడ్డ పరిశ్రమలు తెరిపించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై ఈ మహాసభలో చర్చించి రానున్న కాలంలో పోరాటాలు నిర్వహించేందుకు కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. ఈ మహాసభల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి ఎం.నరసింహనాయక్, నాయకులు సి.వెంకటేశ్వర్లు, మాబాష, సత్యబాబు, కె.వెంకటేశ్వర్లు, మల్లికమ్మ ఉన్నారు.


## నందివాహనంపై స్వామి, అమ్మవార్లు

**శ్రీశైలం :** శ్రీశైలంలోని భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లకు మంగళవారం నందివాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ధనుర్మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి సోమవారం రాత్రి వార్షిక ఆరుద్రోత్సవం నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున ఉదయకాల పూజలు చేపట్టారు. అనంతరం ఉత్తరద్వార దర్శనం, తర్వాత నందివాహనంపై స్వామి, అమ్మవార్ల విగ్రహ మూర్తులను, ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి ఉత్తరద్వారం గుండా ప్రధాన వీధుల్లోకి ప్రవేశింపజేశారు. తర్వాత క్షేత్రంలోని ప్రధాన వీధుల్లో గంగాధర మండపం వద్ద నుంచి నంది మండపం, బయలు వీరభద్రస్వామి మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముందుగా స్వామివారికి లింగోద్భవకాల రుద్రాభిషేకం నిర్వహించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...**

ఎమ్మిగనూరు పట్టణం ఎస్ఎంటి కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ భీమిరెడ్డి(45) అక్కడికక్కడే మృతి చెందారు. ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా బనవాసికి చెందిన ఖాదర్‌బాష (48) మృతి చెందారు. అలాగే ఎమ్మిగనూరుకు చెందిన ఉపాధ్యాయులు ప్రభుదాసు, కోటేకల్లుకు చెందిన దేవదాసు, ఇరుసాపురానికి చెందిన శ్రీనివాసాచారి, కోటేకల్లుకు చెందిన కురువ జయమ్మ, ఆదోనికి చెందిన నూర్‌అహ్మద్, చిలకలడోణకు చెందిన ఇరిగేషన్ ఉద్యోగి ఆంజనేయులు, ఎమ్మిగనూరుకు చెందిన బైచిగేరి విజయలక్ష్మి, కోటేకల్లుకు చెందిన ఈరన్న, ముగతికి చెందిన అన్వర్‌బాష, ఎమ్మిగనూరు చెందిన రాజుకు గాయాలయ్యాయి. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డీఎస్పీ అంకినీడు



ప్రసాద్, సిఐ జి.ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యులు బాలాజీ, బాలయ్య ప్రథమ చికిత్స అందజేశారు.

**బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి.జయనాగేశ్వరరెడ్డి పరామర్శించారు. అలాగే క్షతగాత్రులను సంఘటనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఎంపిపి శంకరయ్య, మున్సిపల్ వైస్ కొండయ్య చౌదరి, కౌన్సిలర్ మధుబాబు ఉన్నారు. అలాగే వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, క్షతగాత్రులతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

**ప్రజాశక్తి - నంద్యాల క్రైం**

అత్యుత్తమ విద్యా బోధనతో ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురపాలక ఉపాధ్యాయుల సంఘం 2018 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. విద్యార్థులు ఒత్తిడితో చదవకుండా ఇష్టంగా చదవాలని కోరారు. నంద్యాల పురపాలక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు అసదుల్లా హుసేన్, చలపతి, మహనందిరెడ్డి, గుర్రప్ప, శంకర్ నాయుడు, చలపతి, రవిప్రతాప్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్, రవి, ఉపాధ్యాయులు ఈశ్వరరెడ్డి, జమీల్ బాషా, పుల్లయ్య నాయక్, రవితేజ, రామచంద్రుడు, ఉపాధ్యాయినులు తౌహీద్ భాను, వసంత, సత్యవతి, నిర్మల పాల్గొన్నారు.

# పాఠశాల విద్యకు పాతర - జన్మభూమి జాతర

**ప్రజాశక్తి - శిరువెళ్ల**


జన్మభూమిలో అధికారులు

మరో రెండు నెలల్లో వరుసగా పరీక్షలు ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో వారి విద్యకు అంతరాయం ఏర్పడింది. పాఠశాలల్లో పాఠాలు బోధించాల్సిన సరస్వతీ నిలయాలు సందడే సందడికి నిలయాలుగా మారాయి. 2 నుంచి 11వ తేదీ వరకు జన్మభూమి అంశాలపై విద్యార్థులకు పలు సాంస్కృతిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. శిరువెళ్ల హైస్కూల్, యర్రగుంట్ల కళాశాల, గుంప్రమానుదిన్నె పాఠశాల, ఇతర పాఠశాల్లో జన్మభూమి కార్యక్రమాలు వేదికలుగా మారాయి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులుగా విద్యార్థుల విద్యకు ఆటంకం కలుగకుండా సభలు, సమావేశాలు నిర్వహించుకోవాల్సిన వారే ఆటంకానికి కారణం కావడం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైద్య సేవలు నిలిపివేత

**ఆళ్లగడ్డ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నేషనల్ మెడికల్ కౌన్సిల్ బిల్లుకు వ్యతిరేకంగా పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులు క్లినిక్‌లను డాక్టర్లు మూసివేసి వైద్య సేవలను మంగళవారం నిలిపివేశారు. ఢిల్లీలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు డాక్టర్లందరూ బంద్ పాటించి ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైద్య సేవలను నిలిపివేశారు. డాక్టర్ సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఆళ్లగడ్డ డాక్టర్ల అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బిల్లు ప్రతిపాదనను కేంద్రం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వైద్యులు రామలింగారెడ్డి, శ్రీరామరెడ్డి, లక్ష్మి శేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## మౌజన్ హత్యపై దర్యాప్తు నిష్పక్షపాతంగా జరపాలి : ఆవాజ్

**ప్రజాశక్తి - నంద్యాల**

మౌజన్ హత్యపై దర్యాప్తు నిష్పక్షపాతంగా జరపాలని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి ముర్తుజా పేర్కొన్నారు. మసీదులపై మతోన్మాదుల దాడులు – హత్యాకాండలపై నిరసన అనే అంశంపై మంగళవారం ఆవాజ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆవాజ్ డివిజన్ అధ్యక్షులు అంజాద్ బాషా సిద్దిఖీ, సిపిఎం జిల్లా నాయకులు మస్తాన్‌వలి, సిపిఐ నాయకులు సలాం ఖాన్, ఆవాజ్ పట్టణ కార్యదర్శి జిఎం గౌస్, జమాతే ఇస్లామి నాయకులు మోమిన్ గౌస్, వ్యకాస డివిజన్ అధ్యక్షులు సద్దాం హుసేన్, సిఐటియు నాయకులు లక్ష్మణ్, వెల్ఫేర్ పార్టీ నాయకులు ఫయాజ్, ఫరూక్ పాల్గొని, మాట్లాడారు. మౌజన్ హత్యపై జరిగిన దర్యాప్తు సంతృప్తికరంగా ఉండాలని అన్నారు. ప్రార్థనాలయాలపై దాడులు జరపడం హేయమైన చర్యగా అభివర్ణించారు. తూతూమంత్రంగా దర్యాప్తు జరపడం సరైందికాదని పేర్కొన్నారు. కేంద్రం ముస్లిముల కోసం అవసరమైన బిల్లులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఆవాజ్ యూత్ అధ్యక్షులు నయీం, ఇమామ్‌లు పాల్గొన్నారు.

## ఆల్‌రౌండర్ ఛాంపియన్‌గా దొర్నిపాడు జడ్‌పి హైస్కూల్

**దొర్నిపాడు :** డోన్ సబ్ డివిజన్ స్థాయి కోవెలకుంట్ల జోనల్ అవుకులో జరిగిన అండర్–14, 17 పోటీల్లో ఆల్ రౌండర్ ఛాంపియన్ దొర్నిపాడు జడ్‌పి హైస్కూల్ నిలిచిందని పిఇటి కె.నరసింహులు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బాస్కెట్ బాల్, ఖోఖో, హ్యాండ్ బాల్, సాఫ్ట్‌బాల్, సెపక్‌తక్రా పోటీల్లో మొదటి స్థానం దొర్నిపాడు జడ్‌పి హైస్కూల్ నిలిచిందన్నారు. పరుగుపందెంలో వంశీకుమార్ గోల్డ్‌మెడల్ సాధించారని తెలిపారు. షాట్‌పుట్‌లో పవన్‌కుమార్ 4వ స్థానం నిలిచాడన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆల్ రౌండర్ స్థాయి మొదటి స్థానం పొందిన జడ్‌పి హైస్కూల్ విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వైవి నారాయణరెడ్డి పిఇటి నరసింహులు, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## డాక్టర్ల సమ్మెకు సిపిఎం మద్దతు

**ప్రజాశక్తి - నంద్యాల**

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను (ఎంసిఐ) రద్దు చేసి నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రవేశ పెట్టే బిల్లు వల్ల నష్టం జరుగుతుందని డాక్టర్లు చేస్తున్న సమ్మెకు సిపిఎం మద్దతు ఇస్తున్నట్లు సిపిఎం జిల్లా నాయకులు మస్తాన్‌వలి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ బిల్లు వల్ల బడా ప్రైవేట్ పెట్టుబడిదారి వైద్య, విద్యా సంస్థలకు లాభం చేకూర్చే విధంగా ఉందని అన్నారు. ప్రయివేటు విద్యా సంస్థలు మెడికల్ సీట్లు అమ్ముకోవడానికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

# అర్హులైన పేదలకు గృహాలు

### - సమస్యల పరిష్కారమే లక్ష్యం
### - మంత్రి భూమా అఖిలప్రియ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అఖిలప్రియ

**ఆళ్లగడ్డ రూరల్ :** అర్హులైన ప్రతి పేదవాడికి స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. జన్మభూమి– మాఊరు కార్యక్రమం మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కమిషనర్ వెంకటరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మునుపు మండలంలోని బత్తలూరులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమస్యలు జన్మభూమి ద్వారానే పరిష్కారమౌతా యన్నారు. అర్హులైన వారందరికి రేషన్ కార్డులు, పింఛన్లు అందజేస్తామన్నారు. పట్టణంలో 800 నూతన పింఛన్లు అవసరమని అందులో 300 మంజూరయ్యాయన్నారు. స్థలం ఉండి ఇళ్ల లేని వారు 1442 మంది ఉన్నారని చెప్పారు. వారికందరికి ఇల్లు మంజూరయ్యా యన్నారు. స్థలాలు, ఇళ్లు లేక వున్న వారు 2284 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ప్రతి ఇంటికి ఒక మరుగుదొడ్డి ఉండాలన్నారు. పట్టణంలో మొలకలవాగులోని మురికిని తొలగించేందుకు రూ.3 కోట్లు మంజూరయ్యాయన్నారు. పొదుపు మహిళలు భవనం కావలని కోరారన్నారు. నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. నగర పంచాయతీ నూతన కార్యాలయ భవనం నిర్మించేందుకు రూ. 50 లక్షలు ఉన్నాయన్నారు. పట్టణంలో అసంపూర్తిగా వున్న రోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పురపాలకశాఖ మంత్రి నారాయణ, సిఎంకు పంపామన్నారు. తాగునీటి సమస్య తీర్చేందుకు అహోబిలం సమీపంలోని గండ్లేరు వద్ద నుంచి రూ.72 కోట్లతో పైప్‌లైన్ వేయించి, ఇంటింటికి కొళాయి వేయించి నీటి సమస్యను తగ్గిస్తామన్నారు. ముందుగా గర్భిణిలకు సీమంతం చేశారు. మార్కెట్‌యార్డు ఛైర్మెన్ బివి రామిరెడ్డి. నగర పంచాయతీ ఛైర్మన్ ఎద్దుల ఉషారాణి, డిటి శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలను అందజేస్తున్న సర్పంచి దేశంరెడ్డి

**చాగలమర్రి :** జన్మభూమితో గ్రామాల్లోని సమస్యలు పరిష్కారమవుతాయని గోడిగెనూరు సర్పంచి దేశం రెడ్డి తెలిపారు. మంగళవారం డివనిపెంట, గోడిగెనూరు గ్రామాల్లో సర్పంచులు దేశంరెడ్డి, పుల్లమ్మ అధ్యక్షతన 5వ విడత జన్మభూమి–మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల నోడల్ అధికారి సంజీవరాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా శాఖాధికారులు ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజలు పలు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వైద్య సిబ్బంది, పశువైద్య సిబ్బంది వైద్య శిబిరాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఎంపిడిఓ రాణెమ్మ, తహశీల్దార్ మాలకొండయ్య, ఎంఇఓఅనురాధ, ఏఇలు సిద్దారెడ్డి, కొండారెడ్డి, మద్దిలేటి, పశువైద్యాధికారి పుల్లయ్య, ఇఒఆర్‌డి సుబ్బారెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఎపిఒ రామసుబ్బయ్య, ఎంసిఒ రాజ్‌కుమార్, ఏఇఒలు, అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యదర్శులు స్వర్ణకుమార్, దస్తగిరి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, విఆర్‌ఓలు హుసేన్, హరి, వెలుగు సిబ్బంది, సిరికల్చర్ అధికారులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

**నంద్యాల :** పట్టణంలోని 1, 2, 3, 4వ వార్డుల్లో జన్మభూమి సభలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండలి ఛైర్మన్ ఎన్‌ఎండి ఫరూక్, ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పాల్గొని, మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి హామీ మేరకు మార్కెట్‌యార్డులో భోజనాలు పెట్టి పింఛన్లు, పట్టాలు ఇచ్చారు. వెలుగోడు రిజర్వాయర్ నుంచి నంద్యాలకు రూ.14 కోట్లతో పైపులైన్ వేసి ప్రతి ఇంటికి నీరు ఇస్తామన్నారు. రోడ్ల విస్తరణ కార్యక్రమాన్ని ప్రారంభించామని, త్వరలోనే పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ మోదకొండ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ గంగిశెట్టి విజయకుమార్, కౌన్సిలర్లు, సిడిపిఒ ఎగ్నేస్ ఏంజెల్, డిప్యూటీ తహశీల్దార్ జనార్ధన్ శెట్టి, సిటి మిషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

**పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి :**

స్థానిక బిళ్లలపురం, పెద్దకొట్టాల గ్రామాల్లో ఉపాధి పని చేసిన కూలీలకు పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యకాస నంద్యాల మండల కార్యదర్శి బంగారయ్య, మండలాధ్యక్షులు బండి రత్నమయ్య, నాయకురాలు రాజేశ్వరి మంగళవారం జరిగిన జన్మభూమి కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో పని చేసిన ఉపాధి కూలీలకు బిళ్లలపురంలో రూ.1.69 లక్షలు, పెద్దకొట్టాలలో రూ.79 వేలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి బకాయి కూలీలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెల్లించకపోతే ఉపాధి కార్మికులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు రామకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

**రామకృష్ణ విద్యాసంస్థల్లో :**

రామకృష్ణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వివేకానంద ఆడిటోరియంలో 5వ విడత జన్మభూమి కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల నేతృత్వంలో నిర్వహించారు. సమావేశానికి రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించి, మాట్లాడారు. దేశ సేవ కన్న దేవతార్చన లేదని, జన్మభూమి సేవకన్న మేలైన కార్యక్రమం లేదన్నారు. ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ శివరామిరెడ్డి ఎపిలో సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు అన్న అంశంపై వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ శివారెడ్డి, జన్మభూమి సమన్వయ కర్త ఎన్‌వి రమణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మేరీ, రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఉయ్యాలవాడ :** స్థానిక అల్లూరు, మాయలూరు గ్రామాల్లో మంగళవారం జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. తహశీల్దార్ మోజేష్ ప్రసన్ అంగన్‌వాడీ నూతన భవనాన్ని ప్రారంభించారు. అల్లూరు గ్రామానికి చెందిన నాగేంద్రమ్మ అనే గర్భిణి మహిళకు ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ సుభద్రమ్మ శ్రీమంతులు జరిపించారు. మాయలూరులో ఎంపిడిఒ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. గ్రామ రైతులు తమ రుణమాఫీ వ్యక్తిగత ఖాతాల్లో జమ కాలేదని వారు అధికారులను అడిగారు. అల్లూరు సర్పంచి ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, మాయలూరు సర్పంచి రవిచంద్రుడు పాల్గొన్నారు.

**దొర్నిపాడు :** స్థానిక గుండుపాపలలో సర్పంచ్ పుల్లన్న అధ్యక్షతన జన్మభూమి – మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. 5–రేషన్‌కార్డులకు, 10– పింఛన్లకు, 2– ఎన్‌టిఆర్ గృహాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులు వచ్చాయని స్పెషలాఫీసర్ వర ప్రసాద్ తెలిపారు. ఎంపిడిఒ సుజాతమ్మ, తహశీల్దార్ తిరుపతయ్య, హౌసింగ్ గోపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, అధికారులు

ప్రజాశక్తి
www.prajasakti.com
కర్నూలు
బుధవారం 03 జనవరి 2018

# గడ్డి పరకే బంగారమాయే

## వరిగడ్డికి పెరిగిన గిరాకీ - వేధిస్తున్న పశుగ్రాసం కొరత - ఎండు గడ్డి రేటుకు రెక్కలు



ప్రజాశక్తి - వెల్దుర్తి

**పాడి పంటలకు నెలవు పల్లెసీమలు... ప్రస్తుతం పాడిపశువుల పోషణకు అవసరమైన మేర మేత కరువై పల్లెల్లో పాడి పరిశ్రమ నేలచూపులు చూస్తోంది. వ్యవసాయంలో వాణిజ్య పంటలను ఎక్కువగా సాగు చేయడంతో మేత కరువవుతోంది. పంటల కోతల్లోనూ యాంత్రీకరణ రావడంతో గడ్డి మేతకు పనికి రాకుండా పోతోంది. దీంతో గడ్డి కొరత తీవ్ర స్థాయిలో ఏర్పడుతోంది. గడ్డి పరక బంగారంలా మారిపోతోంది.**




**ఎండుగడ్డి ధర రోజురోజుకు పెరిగిపోవడంతో పాడిపోషకులకు పశువుల పోషణ భారంగా మారుతోంది.**

వెల్దుర్తి మండలంలో 42 గ్రామాలు ఉన్నాయి. అయితే ఏ గ్రామంలోనూ వరి సాగు లేదు. రైతులు, పాడిపోషకులు మేత కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి ఉంది. నంద్యాల, కోవెలకుంట్ల, రుద్రవరం, ఆత్మకూరు, మహానంది మండలాల్లో వరి సాగు అధికంగా చేశారు. అక్కడి నుంచి వరిగడ్డిని ఇక్కడకు ట్రాక్టర్ల ద్వారా తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఒక ట్రాక్టర్ గడ్డిని దాదాపు 7 వేల నుంచి 9 వేల వరకు అమ్ముతున్నారు. ఎండు గడ్డి కొరతతో ఇక్కడి పాడి రైతులు అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**పాడి పరిశ్రమ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం :**

వ్యవసాయానికి అనుబంధంగా పశువుల పెంపకం చేసుకోవాలని ప్రభుత్వ పాలకులు ఊకదంపుడు ప్రసంగాలు చేయడమే తప్ప ఆ మేరకు తీసుకునే చర్యలు మాత్రం శూన్యం. గత కొన్నేళ్లుగా రైతులకు, పొదుపు మహిళలకు సబ్సిడీపై ఇస్తున్న గేదెలు మంజూరు చేయడం లేదు. పశువులకు బీమా పథకాలను కూడా అటకెక్కించారు. గత ప్రభుత్వ హయాంలో పాడిపోషణను ప్రోత్సహించేందుకు పశువుల బీమా పథకాన్ని ప్రవేశపెట్టి అమలుచేశారు. ప్రమాదవశాత్తు పాడి గేదే మృతి చెందితే బీమా సొమ్ము పాడి రైతులను ఆదుకునేది. ప్రస్తుతం టిడిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి అన్ని పథకాలతో పాటు బీమా పథకాన్ని కూడా మంగళం పాడింది. నాలుగేళ్లుగా ఈ పథకంపై ఎలాంటి ఆదేశాలు లేకపోగా ఒక్క పాడిపోషకుడికి కూడా నష్టపరిహారం అందిన దాఖలాలు లేవు. ఇక పశుగ్రాసం కొరత తీర్చడానికి ఉద్దేశించిన పశుగ్రాస క్షేత్రాలంటూ ప్రభుత్వం ఆర్భాటం చేస్తున్నా సొమ్ములు చెల్లించడంలో నిర్లక్ష్యం కారణంగా రైతులు ముందుకు రావడం లేదు.



**పశువుల పోషణ చేపట్టడం కష్టంగా ఉంది : ముత్యాల అరుణ్, వెల్దుర్తి**

గడ్డి కొరత ఏర్పడడంతో పశువుల నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. దాణా ఖర్చులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. నాకు 10 ఆవులు, జత ఎద్దులు, 5 బర్రెలు ఉన్నాయి. వాటి మేత కోసం 5 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని కొర్ర పంటను సాగు చేశాను. అయితే వర్షాలు సరిగా కురవక పంట సరిగా పండక 15 బండ్లు కావాల్సిన కొర్ర గడ్డి 4 బండ్లు మాత్రమే అయింది. దీంతో ఉన్న పశువులకు మేత సరిపోక 5 ఆవులను అమ్మేశాను. పశువుల మేత కోసం మేము తినే తిండి తగ్గించి వాటికి మేత కొనాల్సిన పరిస్థితి నెలకొంది.



**ధరలు చూస్తే దడ పుడుతోంది : జగన్నాథం, గుంటుపల్లె గ్రామం**

ప్రస్తుతం వరిగడ్డి ధరలు దఢ పుట్టిస్తున్నాయి. మాకు దగ్గర గ్రామాలైన తొగర్చేడు, చెరుకులపాడులో హంద్రీ నీవా కాల్వల వెంట అక్కడి రైతులు వరి పంట సాగు చేశారు. అయితే అక్కడి వరి పొలాల వద్దకు వెళ్లి ఎకరా గడ్డిని కొనుగోలు చేస్తే 6 నుంచి 8 వేల రూపాయలు అవుతుంది. దీనికి తోడు రవాణా ఖర్చులు కలుపుకుంటే మరో 2 నుంచి 3 వేల రూపాయలు అదనంగా భారం పడుతోంది.



**ధర ఎక్కువైనా కొనుగోలు చేయాల్సిందే : ఎన్.సురేష్, వెల్దుర్తి**

ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే భవిష్యత్తులో ఎండు గడ్డికి మరింత కొరత ఏర్పడేలా ఉంది. అందుకే ఎండుగడ్డి ధర ఎక్కువైనా ఇప్పుడే కొనుక్కొని నిల్వ చేసుకుంటున్నాము. ఎండుగడ్డి ధర పెరగడంతో పాడిపరిశ్రమ చేయాలా, వద్దా అనే డైలమాలో పడుతున్నాం. కూలీలలో కోయించిన ఎకరా గడ్డి సుమారు 8 వేల రూపాయలు పలుకుతుంది. మిషన్లతో కోయించిన గడ్డి అయితే 6 వేల నుంచి 8 వేల రూపాయలకు దొరుకుతోంది. ఏ గడ్డి అయినా ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి.



**ఎండు గడ్డి దొరకడం లేదు : కె.వెంకటప్ప, ఎన్.వెంకటాపురం గ్రామం**

ప్రస్తుతం ఎండుగడ్డికి చాలా గిరాకీ ఉంది. ఎండు గడ్డి కొందామంటే చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కడా దొరకడం లేదు. ఎక్కడో దూర మండలాలైనా నంద్యాల, కోవెలకుంట్ల నుంచి ఎండుగడ్డిని ట్రాక్టర్లలో తీసుకువచ్చి ఇక్కడ అమ్ముతున్నారు. అయితే ఆ గడ్డిని కొందామంటే ఒక ట్రాక్టర్ సుమారు 9 వేల రూపాయలు పైమాటే. అంత డబ్బుపెట్టి ఎండుగడ్డిని కొనుగోలు చేసి పశువులను పోషించలేం.

**సమిష్టి కృషితోనే రాష్ట్రస్థాయిలో గుర్తింపు**
**శ్రీశక్తి పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి**



అందరి సమిష్టి కృషితో ఐక్యంగా పని చేయడం వల్లే మా శ్రీశక్తి పట్టణ మహిళా సమాఖ్యకు రాష్ట్రస్థాయిలోనే గుర్తింపు వచ్చింది. పుష్కరాల సందర్భంగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఉత్తమ వ్యాపారవేత్తగా అవార్డును అందుకున్నా. చతీస్‌ఘడ్ రాష్ట్రంలో పొదుపు గ్రూపులను ఏర్పాటు చేసేందుకు కర్నూలు నుంచి సభ్యులను పంపాము. మా సమాఖ్యకు సహాయ సహకారాలు అందించి రుణసౌకర్యాన్ని అందించిన అధికారులకు, బ్యాంకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలియజేస్తున్నాం.

**పొదుపు సంఘాల ద్వారానే మాజీవితాల్లో వెలుగు**
**శ్రీశక్తి పట్టణ మహిళా సమాఖ్య కోశాధికారి మంగమ్మ**



పొదుపు సంఘాల ద్వారానే మా జీవితాల్లో వెలుగు వచ్చింది. వచ్చిన ఆదాయం నుండి 60 కుట్టుమిషన్లు కొని కుట్టసెంటర్ పెట్టి మహిళలకు శిక్షణ ఇస్తున్నాం. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రోగులకు బెడ్లు, పండ్లు పంపిణీ చేశాము. ఒక్కొక్క ఎస్ఎల్ఎఫ్‌కు 2 చీరల చొప్పున 100 చీరలు పంపిణీ చేశాం.

**15 మంది ఉపాధి పొందుతున్నారు**
**శ్రీశక్తి పట్టణ మహిళా సమాఖ్య కార్యదర్శి సరళ**



మా జనరిక్ షాప్‌లో సుజాత, శ్రీలత, నసిరుద్దీన్, అల్లావుద్దీన్, రఘు, రమణలు ఫార్మాసిస్టులుగా ఉన్నారు. శంకర్, తిమ్మప్ప, నరేష్, బాషా సహాయకులు పని చేస్తున్నారు. శ్రీనివాసులు అకౌంటెంట్‌గా , ముతుజాబి స్వీపర్‌గా మొత్తం 15 మంది ప్రతి రోజు 8 గంటల చొప్పున షిఫ్టుల ప్రకారం పని చేస్తున్నారు.

# రాష్ట్రాలు దాటిన పొదుపు ఆదర్శం

**స్వయం శక్తితో ఎదుగుతున్న మహిళలు**
**ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న శ్రీశక్తి పట్టణ సమాఖ్య**
**అన్న సంజీవని ద్వారా ప్రజలకు సేవలు**
**ముఖ్యమంత్రి ద్వారా ఉత్తమ వ్యాపారవేత్తగా అవార్డు**

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

**మహిళ తలచుకుంటే ఏమైనా సాధించగలదు. లక్ష్య సాధన కోసం రాత్రిబవంళ్లు కూడా శ్రమించడానికి వెనుకాడరు. అలాంటి కోవకు చెందిన మహిళలలో శ్రీశక్తి పట్టణ మహిళా సమాఖ్య మహిళలు ఉన్నారనడంలో సందేహం లేదు. రోజుకు ఒక్క రూపాయి పొదుపు చేసుకుంటూ పొదుపు లక్ష్మిగ్రూపులుగా ఏర్పడి దినదినాభివృద్ధి చెందుతూ కర్నూలు జిల్లా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా చేశారు. మహిళలు పొదుపు చేసుకున్న డబ్బుతో సంఘంలోని సభ్యులందరూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. పట్టణ సమాఖ్యలు ఏర్పాటు చేసుకొని చాలామంది మహిళలు మెప్మా ద్వారా చేతివృత్తుల్లో కుట్టుశిక్షణలు పొంది ఉపాధి పొందుతున్నారు. అలాంటి మహిళా సమాఖ్యలలో కర్నూలు నగరానికి చెందిన శ్రీశక్తి పట్టణ మహిళా సమాఖ్య అన్నసంజీవని ద్వారా ప్రజలకు సేవలు చేస్తూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రశంసలు అందుకుంది.**

కర్నూలు నగరంలోని పాతబస్తీలో 1999 జులై 13న మణి పొదుపు గ్రూపుగా ప్రారంభమై 2010 విజేత ఐక్య సంఘంగా 18 గ్రూపులతో ఏర్పడింది. 2012లో శ్రీశక్తి పట్టణ సమాఖ్యగా ఏర్పడింది. నాటి నుండి నేటి వరకు మహిళల గ్రూపులలోని మహిళలకు సేవలు అందిస్తుంది. శ్రీశక్తి పట్టణ మహిళా సమాఖ్యకు అధ్యక్షురాలిగా



జి.నాగమణి, కార్యదర్శిగా సరళ, కోశాధికారిగా ఎం.మంగమ్మలు నాయకత్వం వహిస్తున్నారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలలో భాగంగా టైలరింగ్ షాప్ పెట్టి 100 మందికి కుట్టు శిక్షణ ఇచ్చారు. ప్రథమంగా రూ.35 వేలతో మొదలుకొని లక్ష, 2 లక్షలు, 5 లక్షలు చొప్పున క్రమక్రమంగా రుణాలు తీసుకుంటూ సక్రమంగా తిరిగి చెల్లిస్తున్నారు. నాటి కలెక్టర్ మెప్మా పీడీ సహకారంతో అన్న సంజీవిని జీవనధార జనరిక్ మందుల షాపును శ్రీశక్తి పట్టణ మహిళా సమాఖ్యకు 2013 మార్చి 01న కేటాయించారు. ఈ షాపులో ప్రథమంగా రోజుకు 18 వేల రూపాయలతో వ్యాపారం ప్రారంభమై నేడు రోజుకు 60 వేల వ్యాపారం జరుగుతోంది. ఈ మందుల దుకాణంలో 15 మంది పని చేస్తున్నారు. ఇందులో పని చేసే ఫార్మాసిస్టులు 6 మందికి ఒక్కొక్కరికి 10 వేల రూపాయల చొప్పున, నలుగురు హెల్పర్లకు 7 వేల చొప్పున జీతం ఇస్తున్నారు. నాయకత్వం వహిస్తున్న ముగ్గురు రోజుకు ఒక్కొక్కరు రూ.200లు మాత్రమే తీసుకుంటున్నారు. వచ్చిన ఆదాయంలో 50 శాతం ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి, మిగతా 50 శాతం టిఎల్ఎఫ్‌కు ప్రతి మూడు నెలలకోసారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. వీటితో పాటు ఆదాయ పన్ను, అమ్మకపు పన్నులు కూడా చెల్లిస్తున్నారు. ఏజెన్సీల ద్వారా వచ్చిన మందులను పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని తక్కువకు అమ్ముతున్నారు. 2016లో ఎస్ఎల్ఎఫ్‌కు రూ.20 వేలు డివిడెండ్ కూడా పంచారు.



### సామాజిక విప్లవకారిణి, తొలి ఉపాధ్యాయురాలు

# సావిత్రిబాయి పూలే

**నేడు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా...**



సావిత్రిబాయి పూలే మహిళలకు విద్య బోధిస్తున్న చిత్రపటం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

**మనదేశపు తొలి ఉపాధ్యాయురాలుగా, సామాజిక విప్లవకారిణిగా చరిత్రలో చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్న మహోన్నత మహిళ, రచయిత, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే. నేడు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం...**

మహారాష్ట్రలోని సతారా జిల్లా ఖండాలా తాలూకా నయాగావ్ గ్రామంలో 1831 జనవరి 3న రైతు కుటుంబానికి చెందిన ఖండోజి నవ్‌సే పాటిల్, లక్ష్మీబాయి దంపతులకు సావిత్రీబాయి పూలే జన్మించారు. ఈ మహిళ గురజాడ చెప్పినట్లు చరిత్రనే తిరగరాసింది. బ్రాహ్మణ ఆధిపత్యం కొనసాగుతున్న ఆ కాలంలో సంఘసంస్కరణకు బాటలు వేసింది. తొమ్మిదేళ్ల వయస్సులోనే 12 సంవత్సరాల మహాత్మ జ్యోతిరావును వివాహమాడారు. భర్త సహకారంతో చదువు కొనసాగించారు. తన మాదిరి మహిళలందరూ చదువుకుంటే సమాజం వేగవంతమవుతుందని భావించి 1848 మే 12న బహుజనుల కోసం పూనేలోని బుధవార్‌పేట్‌లో మొదటి పాఠశాలను ప్రారంభించారు. దేశంలోనే మొట్ట మొదటి ఉపాధ్యాయురాలయ్యారు. ఛాందసవాదులు ఆమెపై దాడులు చేసినా భయపడలేదు. నాలుగేళ్లలో 20 పాఠశాలలు ప్రారంభించి ఉచిత విద్యను అందించింది. అస్పృశ్యుల కోసం మంచినీటి బావిని తవ్వించారు. వారి విద్య కోసం అహిల్యాశ్రమ్ అనే పాఠశాలను కూడా ప్రారంభించారు. 1849లో పూలే దంపతులను సంఘ బహిష్కరణ చేసినా వారు సామాజిక కార్యక్రమాలు ఆపలేదు. సమాజ సేవ ఒక పక్క, ఉపాధ్యాయురాలుగా మరో పక్క పని చేస్తూనే తన కలానికి పదను పెట్టి కవిత్వాన్ని రాశారు. 1854లో కావ్యఫూలే కవితా సంపుటిని తీసుకొచ్చారు. 1860లో వితతంతువులకు శిరోముండనం చేయవద్దని క్షురకులను చైతన్య పరిచి వారితో ఉద్యమం చేయించి విజయం సాధించారు. 1868లో అంటరానితనాకి వ్యతిరేకంగా పోరాడారు. 1873లో సత్యశోధక సమాజాన్ని స్థాపించి ఆ సంస్థ ద్వారా బాల్య వివాహాలు, మూఢనమ్మకాల నిర్మూలన కోసం, సతీ సహగమనం రూపుమాపడం కోసం, వితతంతు పునర్వివాహం కోసం శ్రమించారు. 1873 డిసెంబర్ 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో వివాహం జరిపించారు. బ్రాహ్మణ విధవరాలి కుమారుడిని దత్తతకు తీసుకొని యశ్వంత్‌గా నామకరణం చేసి వారి ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా పెంచారు. 1870, 1896 సంవత్సరాలలో కరువు కబళిస్తే సుమారు 2 వేల మందికి అన్నదానం చేశారు. వారు నిర్వహించే పాఠశాలల్లో మధ్యాహ్న బోజనం పెట్టారు. 1890 నవంబర్ 28న భర్త మరణించారు. తన భర్త చితికి తనే నిప్పంటించి సంప్రదాయాలకు చెల్లుచీటి వేశారు. 1891లో పావన కాశీసుబోధ్ రత్నాకర్ అనే మరో కావ్యాన్ని రాశారు. జ్యోతిబా భాషణే అనే నాలుగు సంపుటాలకు సంపాదకత్వం వ్యవహరించారు. సావిత్రీబాయి భాషణే వాగనీ అనే గ్రంథం సావిత్రీబాయి ఉపన్యాసాలతో, పాటలతో గ్రంథం విడుదలైంది. 1897లో మహారాష్ట్రలో ప్లేగు వ్యాధి రావడంతో తన కుమారుడితో కలిసి చికిత్సకు నడుం బిగించారు. ఈ క్రమంలోనే 1897 మార్చి 10న ప్లేగు వ్యాధితో మరణించారు. 1997లో భారత ప్రభుత్వం సావిత్రీబాయి జ్ఞాపకార్థం తపాలా స్టాంపును విడుదల చేసింది. ఇటీవల పూనే విశ్వవిద్యాలయానికి సావిత్రీబాయి విశ్వవిద్యాలయంగా పేరు మార్చారు.

**విద్యార్థివై కదలిరా...**
**ఆత్మగౌరవంతో**
**కఠిన దీక్షతో**
**జ్ఞాన సంపదలు సేకరించుకో**
**విద్య లేనిదే జీవితం వృథా**
**అజ్ఞానులమంతా పశువులమే కదా**
**సోమరిగా గడపవద్దు**
**విద్య కొరకు కదులు ముందు**
**బాధితులూ బహిష్కృతుల కడగండ్లను రూపుమాపు**
**సువర్ణావకాశమొకటి నీ ముందున్నది తెలుసుకో**
**కులవ్యవస్థ సంకెళ్లను తెంచి విద్యనందుకో**
**బ్రాహ్మణీయ శాసనాల ధిక్కరించు వెంటనే.**

(సావిత్రిబాయి పూలే విద్య ఆవశ్యకత గూర్చి రాసిన కవిత..)

**వెలుగు దివ్వె సావిత్రిబాయి**
**పామిడి అరుణ, ఉపాధ్యాయిని, ఎంపిపిఎస్, యాదరాళ్ల గ్రామం, వెల్దుర్తి మండలం.**



కులవ్యతిరేక ఉద్యమాల్లో, స్త్రీ హక్కుల పోరాటంలో సావిత్రీబాయి ఎనలేని పోరాటం చేశారు. ఈ రోజు మహిళలు చదువుకుని అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే కారణం ఆ మహానుభావురాలే. 1852లో మహిళా సేవా మండల్‌ను స్థాపించి మానవ హక్కులు, సామాజిక సమస్యలపై చర్చించి, స్త్రీ, పురుష అసమానతల పై మహిళలలను చైతన్య పరిచారు. స్త్రీ జాతికి వెలుగు దివ్వెగా నిలచిన సావిత్రీబాయి స్త్రీజాతికి గర్వకారణం.

**సావిత్రిబాయి జీవితాన్ని పాఠ్యాంశాలుగా చేర్చాలి**
**పి.సుభాన్, మండల విద్యాధికారి, పగిడ్యాల.**



సామాజిక విప్లవ ఉద్యమాలలో సావిత్రిబాయి పాల్గొని స్త్రీవిద్య కోసం నిరంతరం కృషి చేశారు. అధునిక భారతదేశంలోని తొలినాటి కవుల్లో ఆమె ఒకరని చాలా మందికి తెలియదు. శ్రమించి పని చెయ్యండి, శ్రద్ధగా అధ్యయనం చేయండి, మంచి మార్గంలో నడవండి అన్నది సావిత్రిబాయి పూలే నినాదం. అంతటి గొప్ప నినాదాన్ని జాతికిచ్చిన సావిత్రిబాయి జీవితాన్ని భావి తరాలకు అందించాలంటే ఆమె జీవితాన్ని విద్యార్థులకు పాఠ్యాంశాలుగా పెట్టాలి.

# గుంతలమయం కాలేనాయక్ తండా రోడ్డు

## అవస్థలు పడుతున్న గిరిపుత్రులు
## పట్టించుకోని సంబంధిత అధికారులు

ప్రజాశక్తి - బనగానపల్లె అర్బన్


మండలంలోని కాలేనాయక్ తండా రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో గిరిపుత్రులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కాలేనాయక్ తండాలో 100 సుగాలీ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గుత్తి రోడ్డు నుండి కాలేనాయక్ తండా 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. కొండకు సమీపంలో కాలేనాయక్ తండాలో సుగాలీలు జీవనం సాగిస్తున్నారు. తండాకు వెళ్లేందుకు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో సుగాలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 13 సంవత్సరాల క్రితం ఐటిడిఎ నిధులతో తండాలోకి తారురోడ్డు వేశారు. ఆ తరువాత కొద్ది రోజులకే రోడ్డు దెబ్బతింది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ నిలిచి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. సుగాలీలు పొలాల్లో పండించిన పంటలను తండాలోకి తీసుకెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని సుగాలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తండాకు బస్సు సౌకర్యం లేకపోవడంతో సుగాలీలు పెద్దరాజుపాలెం సమీపంలోని గుత్తి రోడ్డులో దిగి అక్కడ నుండి కాలినడకన వెళ్తున్న దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తండాకు బిటి రోడ్డును వేయాలని సుగాలీలు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన కాలేనాయక్ తండా రోడ్డు

**రోడ్డు సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం**
**సోమ్లనాయక్, కాలేనాయక్ తండా**



తండాకు వెళ్లే రోడ్డు సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గుత్తికి వెళ్లే తారురోడ్డు నుండి మా తండాలోకి వెళ్లే దారి గుంతలమయంగా మారింది. దీంతో నడిచి వెళ్లేందుకు, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. పంట పొలాల నుంచి ధాన్యం తెచ్చుకునేందుకు అవస్థలు పడుతున్నాం. రాత్రి పూట వచ్చే సమయంలో గుంతలు కనపడక ప్రమాదాల బారిన పడిన సంఘటనలూ ఉన్నాయి. అధికారులు స్పందించి బిటీ రోడ్డును వేసి ఆదుకోవాలి.

## అవార్డు గ్రహీతకు అభినందనలు

**ప్రజాశక్తి - అవుకు**

సావిత్రిబాయి పూలే తొలి మహిళ ఉపాధ్యాయులు జన్మదినం సందర్భంగా అవార్డు గ్రహీత ఉపాధ్యాయురాలును సన్మానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్‌రావు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అమరావతి సర్వశిక్షా అభియాన్ వారి తరుపున రాష్ట్ర అవార్డును సహాయ ఉపాధ్యాయురాలు కోట కింద మండలంలోని వేములపాడు పాఠశాలలో పని చేస్తున్న రాజేశ్వరిని ఎంపిక చేశారని తలిపారు. మొట్ట మొదటిసారి జిల్లాకు కాకుండా మండలానికి రావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. విద్యాశాఖకు ఆమె చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ఇవ్వడం జరిగిందని ఆమెను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఎంఆర్‌సి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపిపికి ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

కొలిమిగుండ్ల మండలాధ్యక్షులుగా పని చేస్తున్న రామాంజనేయులును ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ నెల 25వ తేదీన మండలాధ్యక్షులు రామాంజనేయులు తండ్రి బ్రహ్మం మృతి చెందడంతో ఆయనను ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. టిడిపి జిల్లా కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, టిడిపి మాజీ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, టిడిపి నాయకులు ఎం రామక్రిష్ణారెడ్డి, విఆర్‌ఒ సంఘం అధ్యక్షులు పేరం సత్యనారాయణరెడ్డి పరామర్శించారు.

# వాలీబాల్ క్రీడాకారులకు అభినందన

**ప్రజాశక్తి - బనగానపల్లె అర్బన్**

కోవెలకుంట్ల జోనల్ స్థాయి పోటీల్లో విజయం సాధించిన వాలీబాల్ క్రీడాకారులను అరుణభారతి సాహితీ సంస్థ అధ్యక్షులు, మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి అభినందించారు. మంగళవారం బిసి రాజారెడ్డి కార్యాలయం లో క్రీడాకారులను అభినందించారు. కోవెలకుంట్ల జోనల్ స్థాయి క్రీడా పోటీలు అవుకులో జరిగాయి. ఈ పోటీల్లో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాకారులు వాలీబాల్ పోటీలల్లో అత్యంత ప్రతిభను కనబరచి మొదటి స్థానంలో నిలిచారు. వీరిని రాజారెడ్డి అభినందించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే సెంట్రల్ జోన్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచి విజయం సాధించాలని కోరారు. క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. క్రీడల్లో పతకాలు సాధించి బనగానపల్లెకు పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని ఆకాక్షించారు. పిఇటి చంద్రావతమ్మ, వాలీబాల్ కోచ్‌లు ఇబ్రహీం, సీనియర్ క్రీడాకారులు ఖాదర్‌ఖాన్, మీరావలి పాల్గొన్నారు.


కీడాకారులను అభినందిస్తున్న మాజీ సర్పంచి బిసి.రాజారెడ్డి

## యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి బనగానపల్లె**

ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడే సంఘాలకే గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీలను ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి ఆవిష్కరి ంచారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయు లందరూ అంకితభావంతో పని చేసి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాక్షించారు. ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కూడాల శంకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సత్యప్రకాష్, మండల గౌరవాధ్యక్షులు కెవి రామిరెడ్డి, మండలాధ్యక్షులు ఎన్ ప్రతాప్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఆర్థిక కార్యదర్శి ఎస్‌ఎండి అనీఫ్, నాయకులు బాలరాజు, దస్తగిరి, క్రిష్ణయ్య, జయప్రకాశం, సతీష్, సిహెచ్ మద్దిలేటి, విజయకుమార్, లక్ష్మనాయక్, గోపాల్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహంపై దాడి చేసిన వారిని శిక్షించాలి

**ప్రజాశక్తి- బనగానపల్లె**

విగ్రహంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి పేరం సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌జివోస్ కాలనీలో మాల మహానాడు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట మండలం అవిడి గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహంపై దాడి చేయడం దారుణమన్నారు. దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు బాలన్న, విఠలాపురం సుబ్బారాయుడు, కైప శ్రీను, చిన్నరాముడు, చెన్నయ్య, కంబయ్య, నాగరాజు, గురుమూర్తి, చంద్ర, మనోహర్, మధు పాల్గొన్నారు.

## ఎపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - బనగానపల్లె అర్బన్**

పట్టణంలోని ఎపిటిఎఫ్ కార్యాలయంలో 2018 క్యాలెండర్, డైరీలను ఎంఇఒ స్వరూప, ఎపిటిఎఫ్ జిల్లా అదనపు కార్యదర్శి మాధవస్వామి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విధుల పట్ల అంకితభావంతో పని చేయాలన్నారు. పని చేసినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. ఉపాధ్యాయుల పట్ల తమకు ఎలాంటి పక్షపాతం లేదని, అందరిని స్నేహభావంతో చూస్తామన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలు సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మధుసూధన్‌రావు, సభ్యులు రామక్రిష్ణ, ఓబులేసు, లింగమయ్య, నాగరాజు, రాజు నాయక్, రమేష్, నరసింహ, దస్తగిరి, సుంకన్న, సుబ్బరాయుడు, బాలరాజు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

## ఎపి రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - బేతంచర్ల**

పట్టణంలోని లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఎపి రైతు సంఘం, ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలోని రైతు కమిటి ఆధ్వర్యంలో మన రైతు అనే క్యాలెండర్‌ను రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వి.సుబ్బరాయుడు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి రైతు సంఘం రైతుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి, గిట్టుబాటు ధర కల్పించడానికి, శాశ్వత రుణ విముక్తికి తదితర సమస్యల కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, చిరుప వెంకటరామిరెడ్డి, గోకారిబాష, గూటుపల్లె రామలింగం, అరిగెల మధనరాజు, సత్యం, తెలుగు రమణయ్య, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసమే జన్మభూమి : ఎమ్మెల్యే బిసి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిసి జనర్ధాన్‌రెడ్డి

**కొలిమిగుండ్ల :** ప్రజల సమస్యల పరిష్కారం కోసమే జన్మభూమి–మా ఊరు కార్యక్రమం ఏర్పాటు చేసిన్నట్లు ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కమ్మవారిపల్లె గ్రామంలో 5వ విడత జన్మభూమి – మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి, నోడల్ అధికారి పుల్లయ్య, డిఆర్‌డిఎ పీడీ రామక్రిష్ణ, ఎపిడి వెంగన్న, ఎంపిడిఒ శోభరాణి, తహశీల్దార్ ఆంజనేయులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల నివేదికలను అడిగి చదివి వినిపించారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పొలాలకు వెళ్లే రస్తాను 2 కిలోమీటర్లు మేర వేయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎపిఒ గంగన్న మాట్లాడుతూ ఆ రాస్తా మంజూరైందని తెలిపారు. మంజూరైనా పనులు ఎందుకు చేయించలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఎపిడి వెంగన్న మాట్లాడుతూ ఆ రస్తా మంజూరైంది కానీ పని చేసేందుకు అనుమతి రాలేదని, అనుమతి వచ్చకా ప్రారంభిస్తామని చెప్పారు.గ్రామంలో ఎన్ని మంజూరయ్యాయని ఎపిఒ గంగన్నను అడుగగా ఎపిఒ తప్పుగా సమాధానాలు చెప్పడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో వ్యక్తిగతమరుగుదొడ్లు ఎన్ని మంజూరయ్యాయి, ఎన్ని పూర్తి అయినాయి అనే విషయాలపై అడిగి తెలుసుకున్నారు. చేసే పనులే పొంతన లేకుండా చెప్పితే ఎలా అని అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపిఎం లింగమయ్యగౌడ్‌ను మండలంలో పొదుపు ఎన్ని గ్రూపులున్నాయి, వాటిలో ఎంతమంది గ్రూపు లీడర్లను మార్చారని అని అడిగారు. మార్చని వారిని త్వరలో పొదుపు బైల ప్రకారం లీడర్లను మార్పు చేయాలని డిఆర్‌డిఎ పీడీ రామక్రిష్ణను ఆదేశించారు. పీడీ మాట్లాడుతూ త్వరలో మార్పు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకొచ్చేందుకే జన్మభూమి నిర్వహించామన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సిఎం సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు అహర్నిషలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల వారు సిఎంను ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 258 రేషన్‌కార్డులు, శ్రీ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కమ్మవారిపల్లెలో రూ.25 లక్షలతో సీసీ రోడ్డుకు ఆయన భూమి పూజ చేశారు. కమ్మవారిపల్లె నుంచి లక్ష్మీంపల్లెకు రూ.కోటి 50 లక్షలతో బీట్ రోడ్డును వేసేందుకు రెండు నెలల్లో టెండర్లకు పిలుస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు. టిడిపి జిల్లా కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, మండలాధ్యక్షులు ఎం రామేశ్వరరెడ్డి, విఆర్ లక్ష్మీరెడ్డి, కమ్మవారిపల్లె రామదాసు, రామ్మోహన్, చెన్నారెడ్డి, హుస్సేన్‌రెడ్డి, పుల్లయ్య, మండలస్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### నొస్సంలో 260, అక్కంపల్లెలో 16 దరఖాస్తులు

**సంజామల :** మండలంలోని నొస్సం, అక్కంపల్లె గ్రామాల్లో మంగళవారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. నొస్సంలో గృహాలకు 40, పింఛన్లకు–37, రేషన్‌కార్డు–37, ఇళ్ల స్థలాలకు–138, మరుగుదొడ్లకు–8, అక్కంపల్లెలో రేషన్‌కార్డులకు–4, పింఛన్లకు–2, గృహాలకు–8, మరుగుదొడ్లకు–2 దరఖాస్తులు వచ్చిన్నట్లు ప్రత్యేక అధికారి సత్యనారాయణ తెలిపారు. ఎంపిడిఒ మురళీ కళ్యాణి, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహశీల్దార్ విజయకుమార్, విఆర్‌ఒ హుస్సేని, పంచాయతీ సెక్రటరి సురేష్, సర్పంచి శ్యామలాదేవి పాల్గొన్నారు.

### రేవనూరుకు ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించాలి


**కోవెలకుంట్ల :** రేవనూరు గ్రామంలో తాగునీటి సౌకర్యానికి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మించాలని వైసిపి నాయకులు బండి తులసిరెడ్డి అధికారులను కోరారు. మంగళవారం 5వ విడత జన్మభూమి రేవనూరు గ్రామంలో ఎంపిడిఒ రామక్రిష్ణ, మండల స్పెషల్ ఆఫీసర్ కొండారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తులసిరెడ్డి మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో రోడ్లు అస్తవ్యస్థంగా ఉన్నాయని, రుణమాఫీ గ్రామాల్లో కొంతమందికి మాత్రమే వచ్చిందన్నారు. మండల ఉపాధ్యక్షులు మల్లు నాగిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతు రుణమాఫీ కింద రూ.96.56 కోట్లు, మైనర్ ఇరిగేషన్ ద్వారా రూ.356 కోట్లు, సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2,82 కోట్లు ఎమ్మెల్యే బిసి.జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి పథకాలు అందాయన్నారు. 40 రేషన్‌కార్డులు మంజూరు కావడంతో వారికి పంపిణీ చేశారు. తహశీల్దార్ సంజీవయ్య, సర్పంచి మహాలక్ష్మీ, నాగఉశేని, హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్, మండల ఎఇలు రామసుబ్బన్న, రవికిరణ్, నజీర్ అహమ్మద్, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

### గ్రామంలో వందశాతం సిసి రోడ్లు వేస్తాం

**బనగానపల్లె రూరల్ :** బీరవోలు గ్రామంలో మట్టి రోడ్లు లేకుండా వంద శాతం వీధుల్లో సీసీ రోడ్లు వేస్తామని ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పలుకూరు, బీరవోలు గ్రామాల్లో 5వ విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. బీరవోలులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఎమ్మెల్యే బిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో రూ.10 లక్షలతో వేసిన సీసీ రోడ్లను, రూ.3.50 లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రుణమాఫీ, డ్వాక్రారుణాలు విడతల వారీగా మాఫీ చేశామన్నారు. గ్రామంలో అర్హులైన దరఖాస్తుదారులందరికి రేషన్‌కార్డులు, పింఛన్లు, పక్కా గృహాలు ఉగాదిలోగా మంజూరు చేస్తామన్నారు. మట్టి రోడ్లు లేకుండా సీసీ రోడ్లు నిర్మించడానికి రూ.76లక్షలు ఖర్చు అవుతుందని అధికారులు తమ దృష్టికి తెచ్చారన్నారు. త్వరలో నిధులు మంజూరు చేయిస్తానన్నారు. పంచాయతీ కార్యాలయానికిరూ.10 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. మాజీ మండలాధ్యక్షులు అంబాల రామక్రిష్ణారెడ్డి, మండల ప్రత్యేక అధికారి సోమశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ వెంకటరెడ్డి, తహశీల్దార్ నూకరాజు, మండల ఇంజినీర్ నాగశ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సాయిక్రిష్ణ, ఎంఇఒ స్వరూప పాల్గొన్నారు.

**ప్యాపిలి :** స్థానిక పెద్దపూజర్ల, చిన్నపూజర్ల, వెంగళాంపల్లె గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం జిల్లా ఎమ్మెల్సీ క్షమంతకమని హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కారం కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా గొర్రెల సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు యాదవ్, ఎంపిపి టి సరస్వతి, ఎంపిడిఒ అమృతరాజ్, స్పెషల్ ఆఫీసర్ ఉమామహేశ్వరమ్మ, తహశీల్దార్ గోవింద్‌సింగ్, ఇఒఆర్‌డి ఐజయ్య, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, జన్మభూమి కమిటీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, ఓసూరు రంగారెడ్డి, ఎన్‌జిఒ తూర్పు లింగారెడ్డి, వ్యవసాయాధికారి అల్లిపీర పాల్గొన్నారు.

**బేతంచర్ల :** అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అమలుకు గ్రామాల్లోని మౌలిక సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జన్మభూమి – మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తుందని మండల నోడల్ అధికారి వెంకటరమణ అన్నారు. మంగళవారం అంబాపురం గ్రామంలో ఎంపిడిఒ మోహన్‌కుమార్, ఆర్‌ఎస్.రంగాపురం గ్రామంలో తహశీల్దార్ అంజనదేవి ఆధ్వర్యంలో జన్మభూమి–మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నోడల్ అధికారి వెంకటరమణ, జడ్‌పిటిసి పద్మావతమ్మ పాల్గొని, మాట్లాడారు. రేషన్‌కార్డులకు, పింఛన్లకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మండలానికి కొత్తగా 500 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. అర్హులైన వారందరికి అందజేస్తామని అన్నారు. పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ ఇఒ నాగేంద్రుడు సంక్షేమ పథకాలపై వివరించారు. అంబాపురం సర్పంచి యాదగిరి వెంకటేశ్వర్లు, ఆర్‌ఎస్.రంగాపురం సర్పంచి యాదవ పెద్దతిమ్మయ్య, మద్దిలేటిస్వామి మాజీ ఆలయ ఛైర్మన్ ఉన్నం ఎల్లనాగయ్య, అధికారులు పాల్గొన్నారు.


కోవెలకుంట్లలో..

# ప్రజా సంక్షేమమే ధ్యేయం



తంగెడంచలో మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ మల్లెల రాజశేఖర్

**ప్రజాశక్తి - జూపాడుబంగ్లా**

ప్రజాసంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమని జడ్‌పి చైర్మన్ మల్లెల రాజశేఖర్ తెలిపారు. 5వ విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమం మంగళవారం మండలంలోని తంగెడంచలో రాజశేఖర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాండ్ర శివానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని నాలుగు విడతలుగా జన్మభూమి నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల మంజూరు కోరుతూ అందిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులు, పింఛన్లకు సంబంధించి తహాశీల్దార్లు, ఎంపిడిఒలు అప్పటికప్పుడే దరఖాస్తుదారులను పరిశీలించి మంజూరు చేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి 2వేల చొప్పున పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సమస్య నెలకొందని ఎంఇఒ శ్రీనివాసులు జడ్‌పి చైర్మన్ దష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి 14వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించాలని ఆదేశించారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.

**ఎక్కడా లేని అభివద్ధి తంగెడంచలోనే :** నియోజకవర్గంలో ఎక్కడా లేని అభివద్ధి తంగెడంచ గ్రామంలో ప్రభుత్వం చేపట్టిందని టిడిపి ఇన్‌ఛార్జి మాండ్ర శివానందరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఇక్కడ మెగా సీడ్ పార్క్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారన్నారు. జైన్ పరిశ్రమ పనులు మొదలయ్యాయని, త్వరలోనే అంబుజా పరిశ్రమ ఏర్పాటవుతుందని చెప్పారు. ఈ పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు దక్కేలా కషి చేస్తామన్నారు. తంగెడంచ గ్రామంలో రోడ్ల నిర్మాణం కోసం చంద్రన్న బాట కార్యక్రమం కింద రూ.కోటితో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.

**వడ్డీలేని రుణాల పంపిణీ**

అనంతరం డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలను రాజశేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. రైతుమిత్ర గ్రూపులకు బ్యాంకు రుణాలు మంజూరు చేశారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకోని ఆర్థికాభివద్ధి సాధించాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి వెంకట్రామయ్య, ఎంపిడిఒ సుబ్బారెడ్డి, తహాశీల్దార్ జాకీర్‌హుస్సేన్, ఇఒఆర్‌డి మహ్మద్ హనీఫ్, శంకరావు, ఎఒ రంగారెడ్డి, ఎఇ శ్రీనాథ్, జడ్‌పిటిసి రంగారెడ్డి, సర్పంచి రామలక్ష్మమ్మ, టిడిపి నాయకులు మోహన్‌రెడ్డి, గిరీశ్వరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రమణారెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

**నందికొట్కూరు :** నందికొట్కూరు మండలం మల్యాల గ్రామంలో 5వ విడత జన్మభూమిని జడ్‌పి చైర్మన్ మల్లెల రాజశేఖర్, మాండ్ర శివానందరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ గుండం రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రేషన్‌కార్డులే, చంద్రన్న బీమా పథకం కింద రూ.5 లక్షలు విలువ చేసే బాండ్‌లను పంపిణీ చేశారు. అలాగే రైతురథం పథకం కింద గ్రామస్తులకు ట్రాక్టర్‌ను పంపిణీ చేశారు. ఎడిఎ వీరారెడ్డి, ఎంపిడిఒ రాజశేఖర్‌రెడ్డి, తహాశీల్దార్ వెంకటేష్ పాల్గొన్నారు.

**పగిడ్యాల :** మండలంలోని గణపురం గ్రామంలో జన్మభూమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జడ్‌పి చైర్మన్ రాజశేఖర్, మాండ్ర శివానందరెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వాలు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయకుండా వదిలేశాయని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని పూర్తి చేసి కెసి రైతులను ఆదుకుందని చెప్పారు. మార్కెట్‌యాడ్ చైర్మన్ గుండం రమణారెడ్డి, నోడల్ అధికారి వీరారెడ్డి, తహాశీల్దార్ కుమారస్వామి, ఎంపిడిఒ విజయలక్ష్మి, ఇఒఆర్‌డి చంద్రశేఖర్, ఎఒ శ్రీనివాసరెడ్డి, ఎంఇఒ సుభాన్, జయంతి, ఎస్‌ఐ రమేష్, టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, అధికారులు, టిడిపి కార్యకర్తలు, పాల్గొన్నారు.

**అధిరారుల నిలదీత**

గణపురం గ్రామంలోని మంగళవారం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో అధికారులను, పాలకులను ప్రజలు నిలదీశారు. వయస్సు మీద పడుతున్నా జిఒ 98 కింద ఇంతవరకూ ఉద్యోగాలు రాలేదని, ఇక ఎప్పుడు వస్తాయని గ్రామానికి చెందిన వెంకటస్వామి ప్రశ్నించారు. టిడిపి ప్రభుత్వంలోనే అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు జిఒ 98 కింద ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పారని అన్నారు. ఇప్పటి వరకూ ఉద్యోగం రాలేదని పాలకులపై మండిపడ్డారు. ఎన్‌టిఆర్ గృహాలకు, వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు రావడం లేదని, ఇళ్లు, మరుగుదొడ్లు నిర్మించుకోవాలని చెబుతున్నారని, బిల్లులు మాత్రం ఇవ్వడం లేదని ప్రజలు నిలదీశారు.



ఆత్మకూరులో మాట్లాడుతున్న హజ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ అహ్మద్‌హుస్సేన్

**ఆత్మకూరు :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక జన్మభూమి అని హజ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ మోమిన్ అహ్మద్‌హుస్సేన్, నగర పంచాయతీ చైర్మన్ శివపురం నూర్‌మహ్మద్ తెలిపారు. పట్టణంలోని 1, 2వ వార్డుల్లో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం నేడు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని తెలిపారు. ఈ పథకాలను సక్రమంగా అమలు చేయడంతో పాటు అర్హులను గుర్తించి రేషన్‌కార్డులు, పింఛన్లు, పక్కాగృహాలు ఈ జన్మభూమిలో మంజూరు చేస్తామన్నారు. నగర పంచాయతీ కమిషనర్ రమేష్‌బాబు, కౌన్సిలర్లు షేక్ నూర్జహా, మురహరి సుగుణమ్మ, నబీరసూల్ పాల్గొన్నారు.

**మిడుతూరు :** మండలంలోని రోళ్లపాడు, సుంకేసులలో నోడల్ అధికారి జయప్రద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ... రోళ్లపాడు గ్రామంలో ప్రజా సమస్యలపై 85 అర్జీలు, సుంకేసులలో 41 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఎక్కువగా నూతనంగా హౌసింగ్ నిర్మాణానికి ఎక్కువ అర్జీలు వచ్చాయన్నారు. 3న తలముడిపి, జలకనూరులో కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

**బండిఆత్మకూరు :** చిన్నదేవళాపురం, నారాయణాపురం గ్రామాల సర్పంచులు కంచెర్ల సునీత, మద్దిలేటి పుల్లమ్మ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. తహాశీల్దార్ సుధాకర్, ఎంపిడిఒ సుబ్బమ్మ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. కుటుంబ వికాసం, సామాజిక వికాసం అనే అంశాలపై జన్మభూమి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సబ్సిడీపై పురుగు మందు స్ప్రేయర్లు పంపిణీ చేశారు. వెలుగు ఎపిఎం సుందరం విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి, పశువైద్యాధికారి కృష్ణమోహన్‌రెడ్డి, పిఆర్ ఎఇ వెంకటరెడ్డి, హౌసింగ్ ఎఇ వాసుదేవుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సుబ్రమణ్యం, వ్యవసాయ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, విఆర్‌ఒ ఫర్జాన పాల్గొన్నారు.

**కొత్తపల్లి :** మండలంలోని ఎర్రమఠం గ్రామంలో సర్పంచి పుల్లయ్యగౌడు ఆధ్వర్యంలో జన్మభూమి నిర్వహించారు. ప్రత్యేకాధికారి సుబ్బారావు, ఎంపిడిఒ కమలాకర్, తహశీల్దార్ రామకృష్ణుడు మాట్లాడారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ రామకృష్ణుడు

మండలంలోని ఆయా శాఖలాధికారులు తమ శాఖ పరిధిలోని ఉన్న ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం రేషన్‌కార్డులు, స్కాలర్‌షిప్‌లు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఎసిడిపిఒ రవణమ్మ, ఎపిఎం ఉమామహేశ్వరి, ఎపిఒ ఉషారాణి, ఎంఇఒ శ్రీరాములు, ఎఒ నాగేంద్రప్రసాద్, పంచాయతీరాజ్ ఎఇ రామచంద్రయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పక్కీరయ్య, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**శ్రీశైలం :** శ్రీశైలంలోని ఎంసిసి పాఠశాల ప్రాంగణంలో జన్మభూమి కార్యక్రమం జరిగింది. పింఛన్లు, రేషన్‌కార్డులు, రుణాలు, పొదుపు రుణాల పంపిణీ చేయలేదు. పింఛన్, రేషన్‌కార్డుల కోసం గతంలో పెట్టుకున్న అర్జీల గురించి ప్రజలు ప్రశ్నించగా తహశీల్దార్ కార్యాలయానికి రావాలని సూచించినట్లుగా ప్రజలు తెలిపారు.

**నిరాశలో ప్రజలు : సిపిఎం**

తమ సమస్యలు జన్మభూమి కార్యక్రమంలో పరిష్కారమవుతాయని ఆశించిన ప్రజలు నిరాశలో ఉన్నారని సిపిఎం నాయకులు చిన్న మారెన్న తెలిపారు. గత 4 జన్మభూమి కార్యక్రమాల్లో వచ్చిన సమస్యలు ఇంత వరకూ పరిష్కారం కాలేదని తెలిపారు. వృద్ధాప్య, వింతుతు, వికలాంగుల పింఛన్లు, రేషన్‌కార్డుల గురించి గతంలో ఇచ్చిన అర్జీలను ఇచ్చే వరకూ పరీక్షించలేదని చెప్పారు.

**పాములపాడు :** మండలంలోని బానుముక్కల, కొత్తబానకచెర్లలో జన్మభూమి కార్యక్రమం జరిగింది. సర్పంచి బాలునాయక్, శ్రీలక్ష్మి అధ్యక్షత వహించారు. నోడల్ అధికారి మస్తాన్‌వలీ, తహశీల్దార్ నాగేంద్రరావు, ఎంపిడిఒ దశరథరామయ్య, ఎంపిపి బి.కృష్ణవేణి, జడ్‌పిటిసి వై.దుష్యంత్‌రెడ్డి పాల్గొన్నారు. నాలుగేళ్ల అభివృద్ధి, చేయాల్సిన అభివృద్ధిపై నోడల్ అధికారి వివరించారు. అనంతరం ఎంపిపి బి.కృష్ణవేణి, జడ్‌పిటిసి దుష్యంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను, ఆరోగ్య సేవలు, పింఛన్, బీమా



సంక్రాంతి కానుక అందజేస్తున్న ఎంపిపి, జడ్‌పిటిసి

పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నోడల్ అధికారి మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రతి చిన్నారిని చదివించే విధంగా తల్లిదండ్రులు ముందుకు రావాలన్నారు. అనంతరం రుణమాఫీ పత్రాలు, రేషన్‌కార్డులు, సంక్రాంతి కానుకను, విద్యార్థుల ఉపకార వేతనాలను అందజేశారు. ఐసిడిఎస్ చిన్నారులకు అన్నప్రసనాలు నిర్వహించారు. టిడిపి జిల్లా కార్యదర్శి బి.వెంకటేశ్వర్‌రావు, ఆయా శాఖలాధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



నందికొట్కూరులో ట్రాక్టర్ పంపిణీ చేస్తున్న రాజశేఖర్, మాండ్ర



బాండ్‌లను పంపిణీ చేస్తున్న కెవిఎన్.రెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలి సంఘం

## పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-శ్రీశైలం**

శ్రీశైలం మండలంలోని పద్మశాలి సంఘం 2018 క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సంఘం కమిటీ సమావేశంలో ఈ క్యాలెండర్ ఆవిష్కరించారు. మొట్టమొదటిసారిగా ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు అధ్యక్షులు నాగశేషు తెలిపారు. 7 నెలల్లో సంఘం చేసిన కార్యక్రమాలు, కుటుంబ సమ్మేళనం, వనభోజనాలు, వంటి కార్యక్రమాలతో పాటు ఈ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించడంపై సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే సంక్రాంతికి మహిళలకు ముగ్గుల పోటీలు కూడా నిర్వహించేందుకు కమిటీలో నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి తగిన బహుమతులు కూడా అందజేస్తామన్నారు.

## ముఖ్యమంత్రి సందేశం వినేందుకు ప్రజలు లేరు : సిపిఎం

**బండిఆత్మకూరు :** మండలంలో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా రెండు గంటల తర్వాత ముఖ్యమంత్రి సందేశాన్ని టివిల ద్వారా ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లోని ప్రజలు ఎవరూ రాకపోవడంతో అధికారులు తీవ్ర నిరుత్సాహానికి గురయి వెనుదిరిగారని సిపిఎం డివిజన్ నాయకులు రామచంద్రుడు తెలిపారు. 2 గంటల తర్వాత గ్రామాల్లో జరిగే ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు అధికారులు నిర్వహించకపోవడం ఈ కార్యక్రమాలపై ప్రజల నుంచి సహకారం రాకపోవడం, టిడిపి ప్రభుత్వ పరిపాలనపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత స్పష్టం కనిపిస్తుందన్నారు.

## అగ్రవర్ణాల దౌర్జన్యాలు నశించాలి

**వెలుగోడు :** దళితులపై అగ్రవర్ణాల దౌర్జన్యాలు, అత్యాచారాలు, దాడులు నశించాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రామదాసు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామంలో అగ్రవర్ణాల వారు దళితులపై దాడులు నిర్వహించి దళిత వాడలకు తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా నిలిపేయడం, దళితులను గ్రామ బహిష్కరణ చేయడం సహించరానిదన్నారు. దళితులను కించపరిచి కులంపేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. టిడిపి అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు పెరిగాయన్నారు. ఈ దాడులను ఖండించి వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే రాబోవు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. సంపత్, తిరుపతయ్య, బాలస్వామి, నాగేంద్ర పాల్గొన్నారు.

## ముచ్చుమర్రి నుంచి కెసికి నీరు విడుదల

**పగిడ్యాల :** ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కెసి కెనాల్‌కు మంగళవారం నీటిని విడుదల చేశారు. సుంకేసుల డ్యాం నుంచి నీటి విడుదల నిలిపేయడంతో కెసి ఒట్టిపోయింది. రైతులు ఆందోళనకు గురికాకుండా మల్యాల హంద్రీనీవా నుంచి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి రెండు పంపుల ద్వారా రోజుకూ 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.



# పెండింగు ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి : సిపిఎం

**ప్రజాశక్తి-ఆదోని**

వెనుకబడిన రాయలసీమ ప్రాంతం అభివృద్ధి కోసం పెండింగు ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.రామాంజినేయులు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య భవన్‌లో డి.లక్ష్మన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకపోతే గతంలో కాంగ్రెస్‌కు పట్టిన గతే బిజెపి, టిడిపిలకు పడుతుందన్నారు. రాయలసీమలోని హంద్రీనీవా, సుజల స్రవంతి తదితర పథకాలకు నిధులు కేటాయించి సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికై చంద్రబాబు చొరవ చూపడం లేదన్నారు. రాజధాని అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తేనే పరిశ్రమలు వస్తాయని, దీంతో రాష్ట్ర అభివృద్ధితోపాటు నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందన్నారు. వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చేవరకు ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మోడీ అధికారంలో వస్తే విదేశాల్లోని నల్లధనాన్ని రప్పిస్తామంటు చెప్పి రెండున్నర ఏళ్లయినా అతీగతి లేదన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిని ఫ్రీ జోన్‌గా గుర్తించాలన్నారు. పశ్చిమ ప్రాంతంలో కరువు కాటకాలతో అల్లాడుతున్న ప్రజలను ఆదుకునేందుకు ఆలూరు ప్రాంతంలోని వేదవతి, తుంగభద్ర నదుల నుంచి వృధాగా పోతున్న వందలాది టిఎంసిల నీటిని నిలువచేసి ఎత్తిపోతల పథకాల ద్వారా ఈ ప్రాంతంలో సాగు, తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. 2014-15 నష్టపరిహారం ప్రకటించినా కొందరికి ఇంతవరకు అందలేదన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తోందన్నారు. వేరుశనగ పంటను ఆయిల్ ఫెడ్, మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయడంలో విఫలం చెందా యన్నారు. పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, పిజి, ఇంజినీరింగ్, మైనార్టీ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పోరంబోకు స్థలంలో నివాసముంటున్న పేదలకు అక్కడే పట్టాలిచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. స్త్రీలకు వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని, కొత్తగా ఏర్పడిన కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీ, వీధిలైట్లు, మంచి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై జనవరి 10, 11, 12 తేదీల్లో ఆలూరులో జరిగే సిపిఎం జిల్లా మహాసభలో చర్చించి భవిష్యతులో ప్రజా ఉద్యమాలకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. మహాసభలకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, జిల్లా నాయకులు పి.ఈరన్న, మహానందరెడ్డి, మండల కార్యదర్శి వెంకటేశులు, నాయకులు పిఎస్.గోపాల్, రామాంజినేయులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

## సిపిఎం జిల్లా మహాసభల

# వాల్‌పోస్టర్ విడుదల

**ప్రజాశక్తి-ఆస్పరి**

ఆలూరు పట్టణంలో ఈనెల 10, 11, 12 తేదీల్లో జరిగే సిపిఎం మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం మండల నాయకులు బాలకృష్ణ, మాణిక్యప్ప, రంగప్ప, రంగస్వామి కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఆస్పరి ప్రాంతంలో టమోటా రైతులను ఆదుకునేందుకు జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అన్ని తరగతుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి కార్యచరణ రూపొందించి పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో చిన్నమల్లేష్, రామానాయుడు, ప్రకాష్, రాజు, శేషప్ప, తిమ్మప్ప, భాస్కర్, రఘు పాల్గొన్నారు.

## గ్రామంలో సమస్యలు పరిష్కరించే వరకు

# జన్మభూమిని బహిష్కరిస్తాం

## ఏ.గోకులపాడు గ్రామస్తులు

**ప్రజాశక్తి-కర్నూలు క్రైం**

తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో జన్మభూమి కార్యక్రమాన్ని బహిష్కరిస్తామని కల్లూరు మండలం ఏ.గోకులపాడు గ్రామస్తులు హెచ్చరించారు. మంగళవారం మీడియా రూం వద్ద కల్లూరు మాజీ ఎంపిపి ఎ.బాలవెంకటేశ్వరరెడ్డి, ఏ.గోకులపాడు సర్పంచి ఎం.లక్ష్మీవరదారెడ్డి మాట్లాడారు. గత సంవత్సరం జరిగిన జన్మభూమి కార్యక్రమంలో గ్రామంలో నెలకొన్న సమస్యలను విన్నవించినా ఇంతవరకు పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్ఓ శశికళదేవికి అందజేశారు. సమావేశంలో చాకలి శంకరయ్య, తెలుగు శాంతమ్మ, పింజరి కాశన్న, కుమ్మరి మాదన్న తదితరులు పాల్గొన్నారు.

## పథకాలను పారదర్శకంగా అందించాలి

**దేవనకొండ:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా పారదర్శకంగా అందజేయాలని ఆలూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి తిప్పేనాయక్, మండల నోడల్ అధికారి పార్వతీదేవి అన్నారు. మంగళవారం జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా వెలమకూరు, అలారుదిన్నె గ్రామాల్లో సర్పంచులు వెంకటేశ్వర్లు, మహేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ అర్హులైన పేదలు సంక్షేమ పథకాల కోసం జన్మభూమిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపిడిఒ, తహశీల్దార్లు మహబూబ్‌బాష, బాలగణేషయ్య, ఎంఇఒ యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం

**దేవనకొండ:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కర్నూలు జిల్లాకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలం చెందినట్లు సిపిఐ కార్యవర్గ సభ్యులు మద్దిలేటిశెట్టి, మండల కార్యదర్శి నర్సారావు విమర్శించారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4న ఆస్పరి మండలంలో ఆలూరు నియోజకవర్గ సిపిఐ శాఖా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని మండలాల నుంచి సిపిఐ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ నాయకులు శేఖర్, రమేష్, నెట్టేకల్లు, జనార్ధన్ పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలు పరిష్కరించాలి

**పెద్దకడుబూరు:** నౌలేకల్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం జన్మభూమి కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి తిక్కారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ గ్రామంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల రోడ్లపై మురికినీరు ప్రవహిస్తోందన్నారు. పాఠశాల ఆవరణలో డ్రెయినేజీ నీరుచేసి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామానికి తాగునీరు సరఫరాచేసే మంచినీటి ట్యాంకును శుభ్రం చేయకపోవడం వల్ల పురుగులు వస్తున్నాయన్నారు. పాఠశాల ఆవరణలో డ్రెయినేజీ వాటర్ రాకుండా సిసి రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. పొలాలకు వెళ్లే రస్తాను బాగు చేయాలని ఎన్నిసార్లు వినతులిచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్ర, హుసేన్‌పీరా, ఈరన్న పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

# పింఛన్లు ఇవ్వండి సారూ...

**ఆస్పరి:** ఎన్నో ఏళ్లుగా పింఛన్లు లేక అవస్థలు పడుతున్నామని, ఈ జన్మభూమిలోనైనా పింఛన్లు ఇవ్వాలని తంగరడోణ గ్రామంలో వృద్ధులు, వితంతువులు అధికారులను కోరారు. మంగళవారం తంగరడోణ గ్రామంలో గ్రామ సర్పంచి గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జన్మభూమి గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా నోడల్ అధికారి చెంగల్‌రాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించేదుకే జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. గ్రామంలోని సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. తోగలగల్లు గ్రామంలో పాఠశాలలో ఒక రైతు పత్తి నిల్వలు ఉంచగా వాటిని వెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి రత్నమ్మ, ఎంపిడిఒ సలీంబాష, తహశీల్దార్ సుబ్రమణ్యం, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ నరేష్, పిఆర్ ఎఇ ఖాదర్‌బాష, హౌసింగ్ ఎఇ విజయకుమార్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, వ్యవసాయ అధికారి మునెమ్మ, ఈఒఆర్‌డి వీరరాజు, ఎపిఎం సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

# అండర్-17లో హెబ్బటం విద్యార్థినుల ప్రతిభ

**ప్రజాశక్తి-హోళగుంద**

డివిజన్ వ్యాప్తంగా 30 పాఠశాలలకు చెందిన విద్యార్థినులు అండర్-17 విభాగంలో మంత్రాలయంలో జరిగిన కబడ్డీ పోటీల్లో హెబ్బటం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారు. మంగళవారం హెచ్ఎం శివన్న విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 30న జరిగిన అండర్-17 బాలికల కబడ్డీ పోటీల్లో మా పాఠశాలకు చెందిన బాలికలు నైపుణ్యం కనబరచి పాఠశాలకు మంచి పేరు తెచ్చారన్నారు. ఆస్పరి మండలం జోహరాపురం గ్రామానికి చెందిన జట్టుపై ఫైనల్లో గెలుపొంది విన్నర్స్‌గా నిలిచారన్నారు. విద్యార్థినులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కులవివక్షపై ప్రభుత్వం కళ్లు తెరవాలి

**మంత్రాలయం:** దళితులను గ్రామాల నుంచి బహిష్కరించి కులవివక్షత చూపినా పెత్తందారులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కళ్లు తెరవాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం రుద్రవరం మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో దళితులను బహిష్కరించడంపై ధర్నా చేపట్టారు. రాఘవేంద్ర సర్కిల్‌లో వాహనాల రాకపోకలను స్తంభింపచేశారు. గ్రామాల్లో కులవివక్షత ఉండటం దురదృష్టకరమన్నారు. అగ్రవర్ణాల ఆధిపత్యానికి దళితులు బలవుతున్నారన్నారు. అలాంటి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షకార్యదర్శులు మోహన్, అనిల్, నాయకులు శాంతిరాజు, లింగయ్య, ఆనంద్, విజయ్, స్వామిదాస్ పాల్గొన్నారు.

# నా భర్త మృతికి కారకులను శిక్షించాలి

**ఆదోని:** నా భర్త మృతికి కారకులను శిక్షించి తనకు న్యాయం చేయాలని భార్య గొల్ల భారతి కోరారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ఓ పరిశ్రమలో నవంబర్ 9న తన భర్త గొల్ల సిద్ధరాములు(35)పై దాడి చేశారన్నారు. నవంబర్ 11న తన భర్తపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ డిసెంబర్ 3న మృతి చెందాడన్నారు. తన భర్త మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ కృషి

**చిప్పగిరి:** ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ నిరంతరంగా కృషి చేస్తోందని యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎంఆర్‌సి కార్యాలయంలో ఎంఇఒ నారాయణస్వామి చేతుల మీదుగా యుటిఎఫ్ క్యాలెండర్లు, డైరీని ఆవిష్కరించారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం 10వ పిఆర్‌సి బకాయిలను వెంటనే చెల్లించడంతోపాటు 11వ పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం డిఎస్‌సిని ఎపిపిఎస్‌కు అప్పగించరాదన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కంబగిరి గోపి, గౌరవాధ్యక్షుడు గోపాల్, కార్యదర్శులు హరతి, మదన్‌మోహన్, వెంకటమరణ, అజయ్‌కుమార్, ఆదినారాయణ పాల్గొన్నారు.

# సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-ఆలూరురూరల్**

ఆలూరు పట్టణంలో ఈనెల 10, 11, 12 తేదీల్లో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, సిపిఎం డివిజన్ కార్యదర్శి హనుమంతు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో సిపిఎం జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల విజయవంతం కోసం ఈనెల 4, 5, 6 తేదీల్లో జీపుజాత కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో జీపుజాతా ద్వారా ప్రచారం నిర్వహిస్తామన్నారు. 7న పట్టణంలో పార్టీ కార్యకర్తలు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 8న రెడ్‌షర్ట్ వాలంటీర్స్‌తో పట్టణంలో మహా ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. 10న భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. ఈ మహాసభల్లో ఆలూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం వేదావతిపై రిజర్వాయర్ నిర్మించాలని, నగరడోణ రిజర్వాయర్ పనులు వెంటనే చేపట్టాలని, హంద్రీనీవా నుంచి తూము ఏర్పాటు చేసి ఎల్లెల్సి కాలువ చివరాయకట్టు రైతులకు సాగునీరివ్వాలని, దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటు చేసి రైతుల పంటలను కాపాడాలని తదితర సమస్యలపై జిల్లా మహాసభల వేదికగా ప్రతినిధులు చర్చించి కార్యచరణ రూపొందించుకొని భవిష్యత్తులో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, తిమ్మప్ప, రాజ్‌కుమార్, రమేష్, నాగరాజు, సుంకన్న పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న రాధాకృష్ణ, తదితరులు

### పులికనుమ ప్రాజెక్టు నుంచి తూము ఏర్పాటు కోసం

# దశల వారి ఉద్యమాలు

**ప్రజాశక్తి-కోసిగి**

పులికనుమ ప్రాజెక్టు నుంచి తూము ఏర్పాటు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పులికనుమ తూము సాధన కమిటీ ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమాలు చేపడతామని ఆ కమిటీ కన్వీనర్ రాముడు తెలిపారు. మంగళవారం బీరప్పస్వామి దేవాలయ ఆవరణలో పులికనుమ ప్రాజెక్టుకు తూము ఏర్పాటు చేసి కోసిగి మండల రైతులకు, ప్రజలకు సాగు, తాగు నీరందించాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైసిపి నాయకులు మురళీరెడ్డి, బెట్టప్పగౌడ్, లవకుశ ఈరన్న, కాంగ్రెస్ నాయకులు, సిపిఎం నాయకులు లింగన్న, తిక్కన్న, మల్లయ్య, సిపిఐ నాయకులు రాజు, వాల్మీకి నవ సంకల్పం అసోసియేషన్ నాయకులు నాగరాజు, మధు, హనుమేష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు దుర్గప్ప, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రామాచారి, శాలివాహన సంఘం నాయకులు రాజు, వికలాంగుల సంఘం నాయకులు ఈరన్న, క్రీడా సంఘం నాయకులు రమేష్, బిఎస్‌ఎఫ్, మైనార్టీ సంఘం నాయకులు పాల్గొని మాట్లాడారు. పులికనుమ ప్రాజెక్టు కోసిగి మండల ప్రజల హక్కు అని అన్నారు. ఈ ప్రాజెక్టు నుంచి మండల రైతులకు సాగునీరివ్వకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. మండలంలోని రైతులు పంటలు పండక వలసలు పోతున్నారన్నారు. కూలీలకు పనుల్లేక దూర ప్రాంతాలకు వలస వెళుతున్నా, ఇంత దుర్భిక్ష పరిస్థితి ఉన్నా కోసిగి మండల ప్రజలను ప్రభుత్వం చిన్నచూపు చూడటం దారుణమన్నారు. ప్రాజెక్టు కోసం మండల రైతులు వందలాది ఎకరాల భూములు కోల్పోయినా కనీసం సాగుకు నోచుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కోసిగికి తూము ఏర్పాటు చేసిన తరువాతే పులికనుమ ప్రాజెక్టు ప్రారంభించాలన్నారు. లేదంటే ప్రారంభాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మండల ప్రజలపై చిన్నచూపు చూడకుండా తూమును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు మల్లికార్జున, వీరేష్, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



విజయోత్సవంలో విద్యార్థినులు

## క్రీడాకారులకు డిప్యూటీ డిఇఒ అభినందనలు

**ప్రజాశక్తి-మంత్రాలయం**

డివిజనల్ స్థాయిలో నిర్వహించిన త్రోబాల్‌లో విజేతగా నిలిచిన జట్టును డిప్యూటీ డిఇఒ ఈరన్న అభినందించారు. పరిమళ పాఠశాలలో బాలికల క్రీడలు నిర్వహించిన నేపథ్యంలో ఆదోని టిజిఎకె ఆర్‌కెడి ఇంగ్లీష్ మీడియం హైస్కూలు జట్టు విజయం సాధించారు. దీనికి సర్టిఫికేట్లతోపాటు షీల్డ్‌ను అందజేసిన సందర్భంగా ఆయన అభినందించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో రాణించి పాఠశాల, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. పాఠశాల డైరెక్టర్ ఆనంద్‌గుప్త, హెచ్‌ఎంలు రాజేంద్రకుమార్, పాండురంగ, ఉపాధ్యాయులు వీరేష్, పిఇటి ప్రతాప్ పాల్గొన్నారు.

## ఎపిటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-గోనెగండ్ల**

మండలంలోని మానవ వనరుల కేంద్రంలో మంగళవారం ఎపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఎంఇఒ వినోద్‌కుమార్ ఆవిష్కరించారు. ఎపిటిఎఫ్ మండలాధ్యక్షుడు అంపన్న మాట్లాడుతూ స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు, కొత్త పే కమిషన్ ఏర్పాటు, పాత పిఆర్‌సి బకాయిలు వెంటనే విడుదల చేయాలని, మూడు విడతల డిఎను ప్రకటించి స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు ఎస్.రహెమతుల్లా, అంజినయ్య, తిమ్మప్ప, శ్రీనివాసులు, రాఘవేంద్ర, మాహబూబ్‌బాష, రాష్ట్ర కౌన్సిలర్ అమానుల్లా బేగ్ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

## 'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

**ప్రజాశక్తి-కౌతాళం**

10వ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా పరిషత్ స్కూలు హెచ్‌ఎం జగదీశ్వరయ్య కోరారు. మంగళవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం హెచ్‌ఎంకు నూతన ఏడాది శుభాకాంక్షలు తెలియజేస్తూ పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే పరీక్షల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మనోధైర్యం కూడా కల్పించాలన్నారు. పరీక్షలకు విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ సలీం పాల్గొన్నారు.



జగదీశ్వరయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

## నేడు సిపిఎం మండల శాఖ సమావేశం

**దేవనకొండ:** అయ్యప్ప స్వామి దేవాలయ ఆవరణలో బుధవారం సిపిఎం మండల శాఖా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి యూసూఫ్‌బాష మంగళవారం విలేకరులకు తెలిపారు. సమావేశంలో మండలంలోని ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం భవిష్యతులో చేపట్టే ఉద్యమాలపై తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా డివిజన్ నాయకులు రాధాకృష్ణ హాజరవుతారన్నారు.

# సమస్యల పరిష్కారానికే జన్మభూమి

**ప్రజాశక్తి-విలేకరులు**

**ఆదోని:** ప్రజలెదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జన్మభూమి మాఊరు కార్యక్రమం చేపట్టిందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గం ఇన్చార్జి కొంకా మీనాక్షినాయుడు అన్నారు. మంగళవారం దిబ్బనకల్, సలకలకొండ, బసరకొడు, విరుపాపురం గ్రామంలో జన్మభూమి సభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. నోడల్ అధికారి పుల్లారెడ్డి, తహశీల్దార్ శ్రీనాథ్, ఐసిడిఎస్ అధికారి శాంతిదుర్గ, సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, నాయకులు బసాపురం రామస్వామి, నర్సయ్యగౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**చిప్పగిరి:** సమస్యలను పరిష్కరించుకోవడానికే జన్మభూమి మా ఊరు చేపట్టినట్లు ఎంపిపి పాముల పద్మావతి అన్నారు. మంగళవారం రామదుర్గం గ్రామంలో సర్పంచి రోహిణి అధ్యక్షతన జన్మభూమి కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్‌గా రామచంద్రారెడ్డి హాజరయ్యారు. జన్మభూమి ఉద్దేశ్యాన్ని ఎంఇఒ నారాయణ స్వామి చదివి వినిపించారు. ఆయా శాఖల అధికారులు తమ రిపోర్టులను ప్రజల ముందుంచారు. వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్‌ను కరువు పరిహారంపై మరుగుదొడ్లు కట్టుకున్న వారు బిల్లులు మంజూరు కాలేదని నిలదీశారు. ఎంపిపి పాముల పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను సిఎం చంద్రబాబునాయుడు దశలవారీగా నెరవేరుస్తుందన్నారు. సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి మీనాక్షినాయుడు, టిడిపి మండల కన్వీనర్ భీమిలింగప్ప చౌదరి, నాయకులు పాముల సన్నప్ప, తిమ్మయ్య, తహశీల్దార్ వలిబాష, ఈఒఆర్‌డి భాస్కర్‌రావు, పంచాయతీ ఎఇ అన్వర్‌హుసేన్, పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు, విఆర్ఒ మల్లికార్జున, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఎంపిఒ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**కోసిగి:** పార్టీలకతీతంగా పనిచేసి అభివృద్ధి చేస్తామని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల ఫుడ్ కమిటీ మెంబర్ గుడిసె కృష్ణమ్మ అన్నారు. మంగళవారం దుద్ది, చిర్తనకల్లు గ్రామాల్లో సర్పంచి రామలింగమ్మ అధ్యక్షతన జరిగిన జన్మభూమి కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈఒఆర్‌డి అయ్యన్న జన్మభూమిలో సందేశాన్ని వినిపించి ప్రతిజ్ఞ చేయించారు. సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, కోసిగి సర్పంచి ముత్తురెడ్డి, టిడిపి నాయకులు వక్రాణి వెంకటేశ్వర్లు, మారెప్ప, తాయన్న, జ్ఞానేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**గోనెగండ్ల:** మండలంలో జన్మభూమి మాఊరు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మండలంలోని అధికారులు బృందాలుగా విడిపోయి వివిధ గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపిడిఒ నాగరాజు లింగందిన్నె గ్రామంలో, తహశీల్దార్ బాలగణేషయ్య బృందం కున్నూరు గ్రామంలో కార్యక్రమానికి హాజరయ్యారు. గోనెగండ్లలోని పంచాయతీ కార్యాలయంలో పిఆర్ ఎఇ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 9, 10 తరగతులు చదివే విద్యార్థినీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, త్వరలో బిసిలకు చంద్రన్న పెళ్లి కానుక రూ.35, గిరిజన పెళ్లి కానుక, మైనార్టీలకు రూ.50, తదితర పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు శాంతిరాజు, ఎండి ఆంజనేయులు, బిసి బాలికల హాస్టల్ వార్డెన్ శారద, కెజిబివి ఎస్ఒ విద్యావతి, ఎపిఒ మల్లికార్జున, ఆర్ఐ జర్మియా, హౌసింగ్ ఎఇ పాల్గొన్నారు.

**కౌతాళం:** ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే జన్మభూమి ధ్యేయమని రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ ఉలిగయ్య పేర్కొన్నారు. మంగళవారం నదిచాగి గ్రామంలో జన్మభూమి మా ఊరు నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు మంచి సేవలందించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. గ్రామాల్లో ప్రజలకున్న కష్టాలను అక్కడికక్కడే పరిష్కరించేందకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం చంద్రన్న బీమా కింద మంజూరైన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బంగారమ్మ, జడ్‌పిటిసి లక్ష్మి, టిడిపి నాయకులు మారెప్ప, సర్పంచి భీమయ్య పాల్గొన్నారు.

**హోళగుంద:** సమస్యల పరిష్కారానికే జన్మభూమి మా ఊరు ఉద్దేశ్యమని నోడల్ అధికారి లక్ష్మిప్రసాద్, తహశీల్దార్ సతీష్, ఎంపిడిఒ దాసరి మేరీ, ఎస్ఐ మారుతి, ఎంఇఒ మహబూబ్‌జాన్, గ్రామీణ అభివృద్ధి ఎపిడి లోకేశ్వర్ అన్నారు. మార్లమడికి, నాగరకన్వి, వన్నూరు గ్రామాల్లో మంగళవారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొత్త పెన్షన్ లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ప్రజలు మాట్లాడుతూ మార్లమడికి వందగల్లు రోడ్డు నిర్మించాలన్నారు. వన్నూరు నాగరకన్వి గ్రామాలకు బస్ సౌకర్యంలేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. బిటి రోడ్డు నిర్మాణం చేపడితే గ్రామాలకు బస్సులొచ్చే అవకాశముందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ ఆదినారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ బాలచంద్ర ఆచారి, సర్వేయర్ బసవయ్యస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**మంత్రాలయం:** మండలంలోని కాచాపురం, నారాయణపురం, ఖడ్గల్ గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమంలో వినతులు అధిక సంఖ్యలో స్వీకరించినట్లు ఎంపిడిఒ మధుసూదన్‌రెడ్డి, తహశీల్దార్ పద్మనాభ రావు తెలిపారు. మంగళవారం గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. కాచాపురం నుంచి 85 వినతులు, నారాయణపురం 73, ఖడ్గల్ 93 వినతులు వివిధ సమస్యలపై వచ్చినట్లు తెలిపారు. నివేదికను జిల్లా అధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండల స్థాయి అధికారులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

**ఆలూరురూరల్:** ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తోందని శాలివాహన ఫెడరేషన్ ఛైర్మన్ తుగ్గలి నాగేంద్ర అన్నారు. మంగళవారం హత్తిబెళగల్ గ్రామంలో సర్పంచి మహేశ్వరి అధ్యక్షతన జన్మభూమి సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో 19 లక్షల ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రాజశేఖర్, జడ్‌పిటిసి రాంభీంనాయుడు, తహశీల్దార్ సూర్యనారాయణప్రసాద్, ఎంపిడిఒ విజయభాస్కర్, ఎంపిటిసి నాగేంద్ర, మండల స్థాయి అధికారులు, టిడిపి నాయకులు ఈరన్న పాల్గొన్నారు.

**పెద్దకడుబూరు:** సమస్యల పరిష్కారమే జన్మభూమి మా ఊరు కార్యక్రమం ధ్యేయమని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి తిక్కారెడ్డి, జిల్లా కార్యదర్శి నరవ రమాకాంతరెడ్డి అన్నారు. మంగళవారం జన్మభూమి మా ఊరు కార్యక్రమం మండలంలోని తారాపురం, నౌలేకల్లు గ్రామాల్లో జరిగింది. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే అధికారులు ఈ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, రోడ్లు, డ్రైయినేజీ తదితర సమస్యలపై అధికారులతో చర్చించి వెంటనే పరిష్కరిస్తామన్నారు. వైద్యాశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఎంపిడిఒ వరప్రసాద్, తహశీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.

**నందవరం:** ప్రజల సంక్షేమానికి టిడిపి ఎల్లప్పుడు కృషి చేస్తుందని, ప్రజల అభివృద్ధే టిడిపి ధ్యేయమని ఎమ్మెల్యే బివి జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని టి.సోమలగూడూరు, పొనకలదిన్నె గ్రామాల్లో 5వ విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కౌతాళంలో చెక్కును అందజేస్తున్న దృశ్యం





పెద్దకడబూరులో మాట్లాడుతున్న తిక్కారెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

## విత్తనోత్పత్తి రైతులపై వేధింపులు ఆపాలి

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

విత్తనోత్పత్తి రైతులపై వేధింపులు ఆపాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం కెకె.భవన్‌లో సుస్థిర వ్యవసాయ విత్తనోత్పత్తి సహకార సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. టి.రమేష్‌కుమార్ మాట్లాడుతూ పత్తి విత్తనాలలో బిటి-3 లో జీన్స్ ఉందని, సీడ్ ఉత్పత్తి చేసేవారిపై, చిన్నవ్యాపారులపై దాడులు చేసి కేసులు పెడుతున్నారన్నారు. ప్రయోగశాలలో లేకున్న కర్నూలు జిల్లాలోనే దాడులు నిర్వహించి రైతులను వేధించడం సరికాదన్నారు. అన్ని రాష్ట్రాలలో ప్రయోగశాలలు ఉన్నాయని చెప్పారు. 2007లో మ్యాన్‌శాంటో కంపెనీకి ప్రభుత్వం అనుమతినిచ్చి విత్తనోత్పత్తి చేసిన మైకో కంపెనీపై కేసులు పెట్టి శిక్షించాలని అన్నారు. సీడ్ ఉత్పత్తి చేసేది కర్నూలులో అయినప్పటికీ ఈ దాడులు నిర్వహించడంతో 15 వేలమంది సీడ్ ప్రాసెస్‌పై జీవించేవారు దాడులకు భయపడి జిల్లా వదిలి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గతంలో 30 కంపెనీలు ఉండేవి. ఇప్పుడు కేవలం 10 కంపెనీలు మాత్రమే విత్తనోత్పత్తి చేస్తున్నాయన్నారు. దాడులు చేయడం వల్ల కంపెనీలన్నీ ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లాయన్నారు. కర్నూలు జిల్లాలో ఈ దాడులు ఆపకపోతే రైతాంగంతో పెద్దఎత్తున కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సుస్థిర వ్యవసాయ విత్తనోత్పత్తి సహకార సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శివరామ్‌ప్రసాద్, సభ్యులు కె.వేణుబాబు పాల్గొన్నారు.



జన్మభూమిలో మాట్లాడుతున్న రాముడు

## అధికారులను నిలదీసిన సిపిఎం నాయకులు, ప్రజలు

**కర్నూలు కార్పొరేషన్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 5వ జన్మభూమి కార్యక్రమంలో స్థానిక సమస్యలు పరిష్కరించాలని, గత జన్మభూమిలో ఇచ్చిన అర్జీలకు సమాధానాలు తెలియజేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించలేని జన్మభూమి సభ్యులు ఎందుకని 19వ వార్డు గణేష్‌నగర్‌లో మంగళవారం జరిగిన జన్మభూమి కార్యక్రమంలో సిపిఎం కల్లూరు నగర కార్యదర్శి టి.రాముడు, నాయకులు సాయిబాబా, వీరన్న, ప్రజలు అధికారులను నిలదీశారు. అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. 9వ వార్డులోని సోమిశెట్టినగర్ ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, న్యాయవాదుల కాలనీ, గణేష్‌నగర్ 1,2లలో కనీస వసతులైన రోడ్లు, కాల్వలు నిర్మించాలని, పైపులైన్లు లేనిచోట పైపులైన్లు వేయాలని, గత జన్మభూమిలో ఇచ్చిన రేషన్, పింఛన్ల అర్జీలు ఎన్ని వచ్చాయో తెలపాలన్నారు. ఇప్పుడు ఎంతమందికి మంజూరయ్యాయే తెలపాలని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం కొరక జన్మభూమి సభలు నిర్వహించడం తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. జగన్నాథం గట్టు వద్ద 2009లో 10 వేల మందికి స్థలాలు, పట్టాలిచ్చారు. జగన్నాథం గట్టులో 7500 మందికి స్థలాలు రద్దు చేసే అధికారం ఎవ్వరిచ్చారన్నారు. హౌస్‌ఫర్‌ఆల్ పేరుతో పిట్టగూడులాగా ఇళు నిర్మించి ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్నారు. పందిపాడు, ఇందిరమ్మ ఇళ్ల కాలనీలో మౌలిక సమస్యలైన రోడ్లు, కాల్వలు విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు పైసమస్యలను జన్మభూమి సభ ఆమోదించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారులను కలిసిన వారిలో చెన్నయ్య, సీతమ్మ, రుద్రమ్మ, కృష్ణ, రోషన్, కాలనీ ప్రజలు ఉన్నారు.

# అందరూ సమానమే.. వివక్ష తగదు

### -నక్కలదిన్నె గ్రామంలో పర్యటించిన జిల్లా ఎస్‌పి గోపినాథ్‌జెట్టి

**ప్రజాశక్తి - రుద్రవరం**



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌పి

అందరమూ సమానమే, వివక్ష తగదు అని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పౌరహక్కులపై సమావేశాలు ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహన కల్పిస్తామని జిల్లా ఎస్‌పి గోపినాథ్‌జెట్టి అన్నారు. రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామంలో జరిగిన సంఘటనపై ఎస్పీ స్పందించి మంగళవారం హుటాహుటిన గ్రామానికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. అన్ని కులాలకు సమాన హక్కులు ఉన్నాయని, దళితుల పట్ల వివక్ష తగదని గ్రామస్తులకు హితవు పలికారు. సంఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. చట్టానికి అందరూ సమానమేనని, గ్రామంలో అందరూ సోదరభావంతో మెలగాలన్నారు. గ్రామంలోని పెద్దలు, మేధావులు ఇటువంటి అనాగరిక చర్యలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎస్‌పి గ్రామంలో కలయతిరిగి వృద్ధులు, మహిళలు, యువతతో మాట్లాడారు. గతంలో కూడా తమ పొలాలకు నీళ్ల ఇవ్వకుండా అడ్డుకున్నారని, ఇప్పుడు మంచినీటి పైపులను కూడా ధ్వం-సం చేశారని దళితులు ఎస్‌పి దృష్టికి తీసుకువచ్చారు. వెట్టిచాకిరి చేయడం లేదనే నెపంతో దళితవాడకు మంచినీళ్ల సరఫరా, విద్యుత్ సరఫరాను నిలిపివేయడం, నిత్యావసర సరుకులు అందకుండా చేయడంలాటి చర్యలు సరికాదని చెప్పారు. వెంటనే దళితవాడకు మంచినీటి సరఫరాను దగ్గరుండి పునరుద్ధరింపజేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంచినీటి పైపులు పగులగొట్టిన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్‌ను కొనసాగిస్తామన్నారు. ఎస్‌పి వెంట నంద్యాల ఆర్‌డిఒ రామసుందర్, ఆళ్లగడ్డ డిఎస్‌పి చక్రవర్తి, రుద్రవరం ఎస్‌ఐ హనుమంతయ్య తదితరులు ఉన్నారు.

# సమ్మెకు మెడికల్ రెప్స్ సంఘీభావం

**ప్రజాశక్తి - కర్నూలు క్రైం**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నేషనల్ కమీషన్ బిల్లుకు వ్యవతిరేకంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం డాక్టర్‌లు చేపట్టిన ఒక్క రోజు సమ్మెకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్, కర్నూలు శాఖ తరపున సంఘీభావం ప్రకటించామని యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్షావలి తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడారు. నేషనల్ మెడికల్ బిల్లు ప్రవేటు యాజమాన్యానికి అనుకూలంగా ఉందన్నారు. మెడికల్ కళాశాలల స్థాపనకు ప్రభుత్వం నుండి అనుమతి తీసుకోనవసరం లేనట్లుగా ఉందని చెప్పారు. ప్రయివేటు మెడికల్ కాలేజీలు పిజి సీట్లను 50 శాతం ప్రభుత్వ ప్రమేయం లేకుండా పెచుకోవడానికి ఈ బిల్లు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. దీనివల్ల వైద్య, విద్య సామాన్యునికి అందుబాటులో ఉండదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్ మాట్లాడుతూ నేషనల్ కమీషన్‌లో కేవలం 5 రాష్ట్రాలకు సంబంధించిన వారే సభ్యులుగా ఉంటారని, 24 రాష్ట్రాలకు ప్రాధాన్యత ఉండదని, ఇందులో యూనివర్సీటీలకు ఎటువంటి ప్రాతినిధ్యం ఉండదని చెప్పారు. రాష్ట్రానికి ఒకరు చొప్పున అడ్వైజరీ కౌన్సిల్‌లో మాత్రం ఉంటారని తెలిపారు. ఈ బిల్లు వల్ల ఆలిండియా మెడికల్ గ్రాడ్యుయేట్లు వైద్యవృత్తి చేసుకోవడానికి అదనంగా పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఈ బిల్లుపై వైద్యులు నిర్వహించే ఎటువంటి ఆందోళనకైనా మెడికల్‌రెప్స్ మద్దతు ఉంటుందని తెలిపారు. జిల్లా అధ్యక్షులు పుల్లయ్య మాట్లాడుతూ ఎన్‌ఎంసి బిల్లు ద్వారా విదేశీ డాక్టర్‌లు భారతదేశంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా వైద్యవృత్తి చేయడానికి దోహదపడుతుందని అన్నారు.

### జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# నూతన సంవత్సర వేడుకలు

**ప్రజాశక్తి - కర్నూలు లీగల్**



కేక్ కట్ చేస్తున్న బాలుడు

కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సాంప్రదాయంగా వస్తున్న నూతన సంవత్సర వేడుకలను మంగళవారం న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అనుపమా చక్రవర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, వారి కుటుంబసభ్యులు అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. 2012 వరకు ఉన్న కేసులన్నీ త్వరితగతిన పరిష్కారమయ్యేందుకు సహకరించాలని కోరారు. నాల్గవ అదనపు జిల్లా జడ్జి రఘురాం మాట్లాడుతూ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు అందరు కలిసి కృషి చేయాలని కోరారు. రాయలసీమ రీజియన్ ఎసిబి న్యాయమూర్తి సుధాకర్ మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయమూర్తులు అందరూ కలిసికట్టుగా పాత కేసులన్నీ పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు వి.నాగలక్ష్మిదేవి మాట్లాడుతూ తనను ఈస్థాయిలో నిలబెట్టిన న్యాయవాదులందరికీ ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ఏర్పాటు చేసిన కేకును జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఓ చిన్నారితో కట్ చేయించి అందరికీ పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమానికి మొబైల్ జడ్జి ఎం.బాబు, జెఎఫ్‌సిఎం జడ్జి ఆశారాణి, పిడిఎం, ఎడిఎం జడ్జీలు, సీనియర్ సివిల్ జడ్జి మోజస్, అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి గాయత్రి దేవి, మహిళా న్యాయవాదులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కబడ్డీ విజేత 'బిల్లేకల్'

**ప్రజాశక్తి-పెద్దకడుబూరు**

నూతన సంవత్సర సందర్భంగా పెద్దకడుబూరులో నిర్వహించిన డివిజనల్ స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో బిల్లేకల్ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్స్‌లో అలసందగుత్తి, బల్లేకల్ జట్లు పోటీ పడ్డాయి. ప్రతిభ కనబరచి బిల్లేకల్ జట్టు విజేతగా నిలిచింది. బిల్లేకల్‌జట్టుకు రూ.10,116 ఎంపిపి రఘురాం, రన్నర్స్‌గా నిలిచిన అలసందగుత్తి జట్టుకు రూ.5,116 వైసిపి నాయకులు రామాంజినేయులు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, విజయేంద్రరెడ్డి, ముక్కరన్న, అరళప్ప, నిర్వాహకులు రాము, వినీత్ పాల్గొన్నారు.



ప్రైజ్ మనీ అందజేస్తున్న వైసిపి నాయకులు

# ఆత్మహత్యలకు దూరంగా ఉండాలి

**ప్రజాశక్తి-ఎమ్మిగనూరు**




ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు, యువత ఆత్మహత్యలకు దూరంగా ఉండాలని సిఐ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం వైష్ణవి డిగ్రీ, జూనియర్ కళాశాలలు సంయుక్తంగా స్థానిక సోమప్ప సర్కిల్‌లో డ్రగ్స్, ఆత్మహత్యలు, కార్పొరేట్ చదువులు అనే అంశాలపై వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో అనేక సినీ గేయాలకు నృత్యం చేస్తూ డ్రగ్స్ వల్ల జరిగే నష్టాలు, ఆత్మహత్యలు, ఒత్తిళ్లతో కూడిన చదువులు తదితర అనేక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నృత్య ప్రదర్శనలు చేశారు. నృత్య ప్రదర్శనలతోపాటు విద్యార్థులు ప్రజలకు డ్రగ్స్ వాడకం వల్ల జరిగే నష్టాలు, వాడితే పూర్తిగా బానిసలవుతారని, దూరంగా ఉండాలని, సమస్యలొచ్చినప్పుడు వాటిని ఎదుర్కొన్నప్పుడు విజయం సాధిస్తాడన్నారు. నేడు రాష్ట్రంలో కొన్ని కార్పొరేట్ కళాశాలల్లో జరిగే చదువులు ఒత్తిడికి దూరంగా ఉంచాలని తదితర అంశాలపై చైతన్యపరుస్తూ తమ కళాశాల విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతిక అంశాలపై చైతన్యపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైష్ణవి డిగ్రీ, ఇంటర్ కళాశాలల ఛైర్మన్ లింగప్ప, కరస్పాండెంట్ సత్యశ్రీ, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ మధుబాబు, మునెప్ప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు.